



www.aksharamtelugudaily.com

సుఫల

# అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

ఆదివారం 13 జూలై 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 107 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## ఆదాయంలో అధికభాగం వడ్డీల చెల్లింపులకు ఖర్చు

- రుణాలపైన వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం
- మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి
- యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యం
- ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్రదేవ్‌తో భేటీలో సిఎం

➢ 2వ పేజిలో..

## న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నది

- చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించగలగాలి
- కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహనతో ఉండాలి
- న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఇదే ఛాన్స్
- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్




**హైదరాబాద్,జూలై12 (అక్షరం న్యూస్)**
న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ-లో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ..న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాల్సి ఉందన్నారు. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలమన్నారు.మెంటార్‌షిప్‌ను

➢ మిగతా 2వ పేజిలో..

## రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

- వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**నల్లగొండ,జులై 12 (అక్షరం న్యూస్)**
తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో

➢ మిగతా 2వ పేజిలో..

## ప్రాథమిక నివేదికపై ఇప్పుడే నిర్ణయం తగదు

- తుది నివేదిక వచ్చిన తరవాతనే పూర్తి అవగాహన
- మీడియాతో కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు



**విశాఖపట్టణం,జూలై12 (అక్షరం న్యూస్)**
అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన ప్రాథమిక నివేదికపై కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దని విశాఖపట్నంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని సూచించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు-, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమానయానానికి వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇలాంటి సమయంలో ఎలాంటి నిర్ధరణకు రాకుండా తుది నివేదిక కోసం వేచిచూద్దామని తెలిపారు. గత నెలలో

➢ మిగతా 2వ పేజిలో..

## కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

- కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రక నిర్ణయాలు
- వీటిని అభినందించలేకపోతున్న బిఆర్ఎస్
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, జూలై12 : (అక్షరం న్యూస్)**
కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో

➢ మిగతా 2వ పేజిలో..



## ఐదు మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

**న్యూఢిల్లీ, జులై 12 (అక్షరం న్యూస్)**
కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాల్లోని నగరాలకు వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అయిదు మున్సిపల్ కార్పొరేషన్లకు అవార్డులు దక్కాయి. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరాలు ఆ పురస్కారాలు దక్కించుకున్నాయి. జాతీయ స్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖ నగరం సొంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్ అవార్డుకు రాజమండ్రి ఎంపికైంది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కావడంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కారణంగానే ఈ అవార్డులు దక్కాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృషి చేసిన అధికారులు, పారిశుద్ధ సిబ్బంది, సహకరించిన ప్రజలకు పట్టాభి అభినందనలు తెలిపారు.

➢ మిగతా 2వ పేజిలో..

## ప్రాజెక్టుల సత్వర పూర్తికి చర్యలు

భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి.. అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం



**హైదరాబాద్,జులై 12 : (అక్షరం న్యూస్)**
నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, సహాయ - పునరావాస పనులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాలపై సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చాలా కాలంగా భూసేకరణలో జాప్యం కారణంగా గడువులోగా పనులు పూర్తికావడం లేదన్నారు. అంచనా వ్యయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు భూ యజమానులు తదితరులతో సంప్రదింపులు జరపాలి. పరిహారం, పునరావాస ప్రక్రియను పారదర్శకంగా, సున్నితంగా నిర్వహించాల్సి ఉంటు-ంది. ఆలస్యం చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో పాటు- చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. తద్వారా పనులకు ఆటంకం కలుగుతుంది.జిల్లా స్థాయిలో సమన్వయం ఎంతో ముఖ్యమని.. పనుల పురోగతికి

➢ మిగతా 2వ పేజిలో..

## మావోలకు భారీ ఎదురుదెబ్బ

23మంది మావోల లొంగుబాటు

**రాయపూర్,జూలై12 :(అక్షరం న్యూస్)**
ఛత్తీస్‌గఢ్‌లో వరుస లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారీగా మావోలు లొంగిపోయారు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట శనివారం 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. శుక్రవారం నారాయణపూర్ జిల్లాలో ఎస్పీ రాబిన్‌సన్ ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. సుక్మా జిల్లాలో లొంగిపోయిన 23 మందిపై రూ. 1.18 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 9మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందని ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ శర్మ ప్రకటించారు. నక్సలిజం.. చాలామందిని వారి కుటు-ంబాలకు దూరం చేయడమే కాకుండా

➢ మిగతా 2వ పేజిలో..

## ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

నిప్పంటించుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**భువనేశ్వర్,జులై 12 (అక్షరం న్యూస్)**
ఒడిశాలో దారుణం చోటు-చేసుకుంది. ఓ ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు భరించలేని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో 90శాతం కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టు-మిట్టాడుతోంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తోటి విద్యార్థి మంటలంటు-కోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. న్యాయం జరగడం లేదనే ఆవేదనతో కాలేజీ ప్రాంగణంలోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో ఓ విద్యార్థిని బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనమాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వారంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎటు-వంటి చర్యలు తీసుకోలేదు. వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన బాధిత విద్యార్థిని.. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా కాలేజీ క్యాంపస్‌లో నిరసన చేపట్టింది.

➢ మిగతా 2వ పేజిలో..

## కాళేశ్వరంపై కావాలనే దుష్ప్రచారం

మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు

**సిద్దిపేట,జులై 12 : (అక్షరం న్యూస్)**
కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కావాలనే పదేపదే కాళేశ్వరం కూలిపోయిందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండా పక్కన పెట్టారని అన్నారు.



సిద్దిపేటలో 167 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. వర్షాలకు గోదావరిలో 8 లక్షల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయి. మోటార్లు ఆన్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నారు. మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లో రంగనాయకసాగర్

➢ మిగతా 2వ పేజిలో..

# న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నది

**మొదటిపేజీ తరువాయి..** ఒక బాధ్యతగా భావించాలన్నారు. జస్టిస్ గవాయ్ తన ప్రసంగంలో యువ న్యాయవాదులకు, న్యాయ రంగ ప్రవేశిస్తున్న విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన ఆయన, మన దేశం వివిధ లీగల్ ఛాలెంజెస్‌ను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు, న్యాయ సేవలో ఉన్న వారు 'ఎవరేం చెబుతున్నారు' అనే విషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యం అన్నారు. న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే, ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీల కోసం ఆర్థికంగా భారమవ్వకూడదని హెచ్చరించిన ఆయన, మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉంది. విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలి. ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలుచేయడం అవసరం లేదని చెప్పారు. మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యం. న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, , ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి. నల్సార్ యూనివర్సిటీ–తన స్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుండుతుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

## వాణిజ్య పంటలతో లాభాలు గడించాలి

**రైతులకు మంత్రి తుమ్మల సూచనలు**

**ఖమ్మం, జులై 12 :** ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రధానంగా వాణిజ్య పంటలతో లాభాలు గడించాలని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్' ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ నాటికి పామాయిల్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆ దిశగా పనులు పూర్తి చేయాలన్నారు. రిఫైనరీ పనులు కూడా స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పామాయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలు అందిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా వక్క మొక్కలు నాటామని తెలిపారు. మే నెలలో కురిసిన వర్షాలతో పంటసాగు ప్రారంభించిన రైతులకు ఇబ్బంది కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టు–కు నేడు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అహంకారం తగ్గని వైకాపా నేతలు

**పేర్నినాని వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం**

**మండిపడ్డ ఏపీఎస్ ఆర్టీసీ కొనకళ్ళ నారాయణ**

**అమరావతి,జులై 12 :** గత ఎన్నికల ఫలితాల్లో జగన్ మోహన్ రెడ్డి నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి.. ప్రతిపక్ష హోదా దక్కకుండా చేసినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదని ఏపీఎస్ ఆర్టీసీ కొనకళ్ళ నారాయణ అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం అత్యంత అధిక మెజార్టీతో అధికారాన్ని ఇచ్చారు. మీరు ఓడిపోయిన అవమానంతో, అసూయతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారు. రప్పా.. రప్పా.. చీకట్లో కన్ను కోడితే పని అయిపోవాలి.. తలలు లేచిపోవాలి.. అని పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం.. అని ప్రశ్నించారు. మాజీ మంత్రిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని ప్రజాస్వామ్యాన్ని రక్షించేవిధంగా మాట్లాడాలి. కానీ, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం దారుణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంది.. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో హింసను ఎట్టిపరిస్థితుల్లో ప్రొత్సహించరు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తు.. అవినీతి మయంగా, ఆరాచకంగా మార్చారు. గతంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలపై దాడులు చేసి, హత్యలు చేశారు. అది మీ సంస్కృతి.. ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పేర్ని నాని మీద బందరులో ఎన్ని అభియోగాలు ఉన్నాయి.. ఎన్ని నేరాలు చేశావ్.. గోడౌన్ లో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి. రంగనాయకుల గుడి 10 ఎకరాల స్థలానికి ఏమి సమాధానం చెప్తావ్.. బీచ్ పక్కన ఉన్న గుడిసెలను తగలబెట్టారు.. దానికి ఏమి సమాధానం చెప్తావ్.. దమ్ము ఉంటే అక్కడికి వెళ్లి మాట్లాడాలని అన్నారు. పేర్ని నాని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ్మిన వారి సత్రానికి చెందిన 1000 గజాల స్థలాన్ని అక్రమించుకున్నారు. పేర్ని నాని తండ్రి పేర్ని విష్ణుమూర్తి ఎనాడూ కూడా హింసను ప్రోత్సహించే విధంగా మాట్లాడలేదు. కానీ, నీ ప్రవర్తన ధోరణీ మీ నాయకుడు మెచ్చుకునే విధంగా ఉంది. హింసను ప్రోత్సాహించి.. పరుష పదజాలంతో వేరే పార్టీ వారిని తిడితే మీ నాయకుడికి ఆనందం.. జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కడ ఏ విధమైన అవంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తే.. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం యువనాయకులు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తే అడుగు అడుగునా ఆటంకాలు సృష్టించారు. మేము అధికారంలోకి వస్తే గతంలో కంటే మంచి పాలన సాగిమని చెప్పలే కానీ, బెదిరింపులు మాటలతో ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదని అన్నారు.

## ఇరాన్‌లో బాలికపై అత్యాచారం

**వ్యక్తికి బహిరంగ మరణశిక్ష**

**టెహ్రాన్, జులై 12 :** ఓ బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం .. బుకాన్‌కు చెందిన ఓ బాలికను అత్యాచారం చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని భాధిత కుటు–ంబ సభ్యులు , ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా, సుప్రీం కోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటు–ంబ సభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్టు– చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్‌లో బహిరంగంగా మరణశిక్షలు విధించడం సాధారణమే. హత్య, అత్యాచారం వంటి తీవ్రత ఎక్కువ ఉన్న కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలు చేస్తారు. మానవహక్కుల సంఘాల ప్రకారం.. ప్రపంచంలో ఎక్కువ మరణశిక్షలు అమలు చేసే దేశాల్లో ఇరాన్ రెండోస్థానంలో ఉంది. మొదటి స్థానంలో చైనా ఉంది.

## పవన్ కళ్యాణ్‌పై ప్రకాశ్ రాజు అక్కసు

**మండిపడ్డ జనేసన నాయకులు**

**అమరావతి,జులై 12 :** హిందీ నేర్చుకోవాలన్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పై నటుడు ప్రకాష్ రాజ్ మరోసారి విరుచుకుపడ్డారు జస్ట్ ఆస్కింగ్ ద్వారా ఈ స్థాయిలో అమ్మకమా అంటూ పవన్ పై మరో మారు విమర్శలు గుప్పించారు. అయితే ప్రకాశ్రాజ్‌పై జనసేన కూడా విరుచుకు పడింది. హిందీ గురించే కాదు ఇతర భాషల గురించి మాట్లాడే అర్హత ప్రకాశ్రాజ్‌కు లేదని విమర్శించారు. అలా అయితే పలు భాషా సినిమాల్లో ఎందుకు నటిస్తున్నారని మండిపడ్డారు. ప్రకాష్ రాజ్.. ఆయనపై గత కొంత కాలం నుంచి తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఇలా కూడా అమ్ముడవుతారా? అంటూ ఘాటైన విమర్శలు చేస్తున్నారు.

## రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

**మొదటిపేజీ తరువాయి..** 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ– అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ –టె–స్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ –ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని...అక్కడ –ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ ఆ÷ూ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ప్రాథమిక నివేదికపై ఇప్పుడే నిర్ణయం తగదు

**మొదటిపేజీ తరువాయి..** జరిగిన అహ్మదాబాద్–లండన్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో నివేదిక ప్రాథమిక నివేదికను వెల్లడించింది. ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఆఫ్ కావడంతో, ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయినట్లు తేలింది. అయితే, ఇలా ఎందుకు జరిగిందనే దానిపై మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఈ నివేదికపై పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు శనివారం స్పందించారు. దీనిపై మనం ఇప్పుడే ఏలాంటి నిర్ధారణకు రాకూడదని చెప్పారు. మనకు ప్రపంచంలోనే అత్యుత్తమ పైలట్లు–, సిబ్బంది ఉన్నారని తాను నమ్ముతున్నానని, దేశంలో పైలట్లు, సిబ్బంది చేస్తున్న అన్ని ప్రయత్నాలను అభినందిస్తున్నానని చెప్పారు. వారే పౌర విమానయానానికి వెన్నెముక అని చెప్పారు. కాబట్టి మనం ఇప్పుడే ఏ నిర్ణయానికి రాకుండా, తుది నివేదిక కోసం వేచి చూద్ధామని విలేకరులతో అన్నారు.

## కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

**మొదటిపేజీ తరువాయి..** నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా? అని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## ప్రాజెక్టుల సత్వర పూర్తికి చర్యలు

**మొదటిపేజీ తరువాయి..** ఆటంకంగా మారిన సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి స్థాయిలోనూ పనులు సాఫీగా జరగాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరాతీసిన మంత్రి ఉత్తమ్.. ముఖ్యమైన సమస్యలను గుర్తించారు. వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు ప్రాజెక్టులు ఎంతో ముఖ్యమన్నారు. కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే కీలకమైన పాలమూరు–రంగారెడ్డి, సీతారామ సాగర్ ప్రాజెక్టుల పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కాలువ లైనింగ్ మొదలు సొరంగాల వరకు ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు.

## కాళేశ్వరంపై కావాలనే దుష్ప్రచారం

**మొదటిపేజీ తరువాయి..** నిండిపోతుంది. మేడిగడ్డ కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయని అన్నారు. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లు కాళేశ్వరంలో భాగం కావా? ఇవేమీ చూడకుండా కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చపెడితే.. మీరేం చేశారో.. మేమేం చేశామో మాట్లాడుకుందాం అన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే ఆరు నెలల్లో నీళ్లు ఇవ్వొచ్చు. మేం ప్రశ్నించడంతోనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేశారు. నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు. ఓట్లకు ఓట్లకు మధ్య మీరు రైతుభరోసా ఇస్తున్నారు. రైతుభరోసాను ఎలా కోత పెడదామనే చూస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

## మావోలకు భారీ ఎదురుదెబ్బ

**మొదటిపేజీ తరువాయి..** తండ్రి అయ్యే ఆనందం కూడా కోల్పోయేలా చేస్తుందని హోంమంత్రి ఆక్షేపించారు. ఉద్యమంలో ఉండి స్టెరిలైజేషన్ చేయించుకున్న వారు జనజీవన స్రవంతిలోకి వస్తే.. ఐవీఎఫ్ ద్వారా తల్లిదండ్రులు అయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటు–న్న యువతి, యువకులకు అవసరమైతే సామూహిక వివాహాలు జరిపిస్తామని మంత్రి వెల్లడించారు. సుక్మా జిల్లా మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలో కీలక పాత్ర వహించిన మావోయిస్టు నేత లోకేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు.

## ఆదాయంలో అధికభాగం వడ్డీల చెల్లింపులకు ఖర్చు

**రుణాలపైన వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం**

**మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి**

**యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యం**

**ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ మహేంద్రదేవ్‌తో భేటీలో సిఎం**

**సిజెఐ గవాయ్‌తో మర్యాదపూర్వక భేటీ**

**హైదరాబాద్, జులై 12 :** వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని, రుణాలపైన వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించు కున్నప్పుడే.. అభివృద్ధి సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్ శనివారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌తో పాటు– రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు సీఎం వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సారించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, మూడు రంగాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలియజేశారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపైన ఆందోళన వ్యక్తం చేశారు. అధికశాతం వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఇలాంటి విధానం ద్వారానే, సమాఖ్య వ్యవస్థ బలోపేతమవుతుందని, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతోపాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్, ఆర్‌ఆర్‌ఆర్‌ను ఔటర్‌తో అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పర్యటనలో ఉన్న సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌ను సిఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి అభినందించారు.

## రెండు లారీలు ఢీకొనడంతో ఇరుక్కుపోయిన డ్రైవర్

**విజయనగరం,జులై 12 :** జాతీయ రహదారి 46పై శనివారం ఉదయం రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక లారీలో ఉన్న డ్రైవర్ నాయుడు క్యాబిన్ సీట్లో ఇరుక్కుపోయాడు. స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీయాలని ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అగ్నిమాపక స్టేషన్‌కి సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## సీతారామ ప్రాజక్టు నీటి విడుదల

**మోటర్‌కు స్విచ్ ఆన్ చేసిన మంత్రిఉత్తమ్**

**ఖమ్మం,జులై 12 :** గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు శనివారం సీతారామ ప్రాజెక్టులో భాగంగా అశ్వాపురం మండలం కొత్తూరు వద్ద ఏర్పాటు–చేసిన ఎత్తిపోతల నుంచి ఒక మోటారు ఆన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటపడి సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించే పనులను పూర్తిచేశారు. ప్రస్తుతం గోదావరికి వరద ఉధృతంగా వస్తోంది. మరో వైపు పాలేరు వద్ద అండర్ టన్నెల్ గత ఏడాది కూలిపోయింది.. దీంతో సాగర్ జలాలు ఖమ్మం జిల్లాలోని పంటపొలాలకు విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. మరో పదిరోజులు వరకు నీరు రాని పరిస్థితి. దీనివల్ల తల్లాడ, కల్లూరు మేజర్ల కింద పొలాలు ఎండిపోతున్నాయి.. దీనిని దృష్టిలో పెట్టుకొని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు కింద కొత్తూరు వద్ద ఏర్పాటు– చేసిన మోటార్లలో ఒక దానిని శనివారం ఆన్ చేశారు. దీనివల్ల గోదావరి జలాలు ఏన్కూరు వద్ద సాగర్ కాలువలో ప్రవేశించి తల్లాడ, కల్లూరు మేజర్ల కింద ఉన్న సుమారు 30వేల ఎకరాల్లో ఉన్న వరిపంటను రక్షించేందుకు అవకాశం ఉంది. సీతారామ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోయినప్పటికీ అవకాశం ఉన్న మేరకు మోటార్లు బిగించి ఖమ్మం జిల్లా రైతును ఆదుకోవడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయమని రైతులు తెలిపారు.

## చెడు వ్యసనాలకు లోనై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న యువత

- దొంగతనం చేసి పట్టుబడ్డ యువకుడు
- అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించిన చొప్పదండి పోలీసులు



చొప్పదండి /కరీంనగర్,జులై 12 (అక్షరం న్యూస్)

ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ చెడు వ్యసనాలకు లోనై రాగంపేట గ్రామానికి చెందిన కొలిపాక మధు కుమార్ అనే యువకుడు వివిధ చెడు వ్యసనాలకు బానిసై ఉచిత డబ్బు సంపాదించాలని కోరికతో ఆన్లైన్ లో బెట్టింగ్ యాప్స్ వాడుకుంటూ డబ్బు సరిపోకపోవడంతో దొంగతనం చేయాలని అనుకుని రాగంపేట గ్రామంలోని కొమురయ్య ఇంటిలో తేదీ 8 జులై 2025 రోజున పట్టపగలు ఇంటిలో ఎవరు లేని సమయంలో లోపలికి ప్రవేశించి తాళం వేసి ఉన్న బీరువాను పగలగొట్టి అందులో దాచి ఉంచిన ఒక తులం బంగారం,, 22 వేల రూపాయల నగదు దొంగిలించి నాడు. అదే రోజు ఫిర్యాదు తీసుకున్నటువంటి చొప్పదండి ఎస్ఐ తమ సిబ్బంది తో దర్యాప్తు నిర్వహించి ఈరోజు ఇట్టి వ్యక్తిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకోన్నారు. అరెస్ట్ అయిన యువకుడి నుండి బంగారం, డబ్బులు రికవరీ చేసి, అతన్ని ఈరోజు గౌరవ న్యాయ స్థానం నందు హాజరుపర్చినారు.

ఇట్టి సందర్భాన్ని పురస్కరించుకొని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ యువతకు మంచి ఆలోచన సరళి పెంపొందించుకోవాలని,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అదేవిధంగా గ్రామాలలో,ప్రధానమైనటువంటి కూడలిలో గ్రామ ప్రజలు,ఇతర సంఘాల సహకారంతో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇట్టి కేసు దర్యాప్తులో పాల్గొని నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డిని మ,సిబ్బంది ఏఎస్సై సమ్మయ్య, అనిల్ కుమార్, బి శ్రీధర్ ఎండి ఖలీఫాలను లను అభినందించారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పట్ల సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చొప్పదండి/ కరీంనగర్,జులై 12 (అక్షరం న్యూస్ )

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయుటకు మంత్రి మండలి నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, చొప్పదండి శాసనసభ్యులు డా.మేడిపల్లి సత్యంల చిత్రపటానికి పాలాభిషేకం చేసినారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించుటకు ఆర్డినెన్స్ తీసుకొస్తున్న ప్రజా ప్రభుత్వానికి అందరి ఆశీస్సులు ఉండడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన బిసి అభ్యర్థులను గెలిపించి నిబద్ధతో పరిపాలన అందిస్తున్న రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై శిక్షణ

- ఎండి. రజాక్,ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్, కొత్తగూడెం ఏరియా.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 12 జూలై/ అక్షరం న్యూస్: సింగరేణి యాజమాన్యం వారు మహిళలకు తేనె టీగల పెంపకం పై మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, అగర్తల, వెస్ట్ త్రిపుర వారిచే ఉచిత శిక్షణ తో పాటుగా సంబంధిత పరికారాలను ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేలా ప్రోత్సహిస్తుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఎం. షాలేం రాజు గారు జీకేఓసి మరియు వీకేఓసి ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతాలు అనగా కొత్తగూడెం (6,7,8,9 వార్డ్ లకు చెందిన నిర్వాసితులకు), (పెనగడప, రామవరం, రుద్రంపూర్, ధన్బాద్, గరీబ్ పేట్, పెనుబల్లి(చుంచుపల్లి మండలం), రాంపూర్, తిప్పనపల్లి, అంబేద్కర్ నగర్, సీతంపేట్, 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, వనమా నగర్ %డ% (ప్రశాంతి నగర్) మహిళాలకు ఉచిత స్వయం ఉపాధిని కల్పించేందుకు తేనెటీగల పెంపకంలో శిక్షణతో పాటుగా సంబంధిత పరికరాలను కూడా అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. కావున ఆసక్తి కలిగిన పై గ్రామాలలోని మహిళాలు తమ దరఖాస్తులను కొత్తగూడెం ఏరియా పర్సనల్ డిపార్ట్మెంట్ నందు తేదీ. 16.07.2025 లోపు అందజేయాలన్ని పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. పై తెలిపిన గ్రామాలలోని ఆసక్తి గల మహిళాలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని స్వయం ఉపాధి పొంది లబ్ది పొందాలని కొత్తగూడెం ఏరియా ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

# పట్టణ పేదలకు, శ్రామికులకు ఎర్ర జెండానే అండ







- వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న చరిత్ర సిపిఐది.
- పాల్వంచ సమగ్రాభివృద్ధి, పారిశ్రామికీరణలో సిపిఐ పెద్దన్న పాత్ర.
- నియోజకవర్గ అభివృద్ధి పార్టీ మరింత విస్తరణకు తోడ్పడాలి.
- జిల్లా, రాష్ట్ర మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి.
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

ఉల్లాసంగా సిపిఐ పాల్వంచ పట్టణ 19వ మహాసభ.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 12 జూలై /అక్షరం న్యూస్ : పాల్వంచ: పట్టణ పేదలకు, శ్రామికులకు ఎర్ర జెండానే అండ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక లారీ అసోసియేషన్ హాల్ నందు సీపీఐ పాల్వంచ పట్టణ 19వ మహాసభ నిర్వహించారు. తొలుత మహాసభలు ప్రారంభం సూచీకగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో కూనంనేని మాట్లాడుతూ వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న చరిత్ర సీపీఐ కు ఉందని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. కార్మిక, కర్షక, ప్రజల కోసం, ప్రజా హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేసే సత్తా కమ్యూనిస్టులకే ఉంది అన్నారు. దేశ స్వాతంత్ర్య కోసం, పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర ఉద్యమాలతో ప్రజా చైతన్యాన్ని రగిలించిన పార్టీ సిపిఐ ఎన్నో త్యాగాలు చేస్తూ బ్రిటీష్ కాలం నుండి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండేందుకు ఏర్పడిందని స్పష్టం చేశారు. అప్పటి రజాకార్ల, భూస్వాముల, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి దొరలను, దేశ్ముఖ్లను తరిమికొట్టి లక్షలాది ఎకరాల భూమిని పంచి బాంచన్ దొర నీకాల్మోకుత అని బతికే బడుగు బలహీన జీవులు బందూకులు పట్టించి గెరిల్లా రైతాంగ పోరాటం నడిపించిన చరిత్ర సీపీఐదన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజా హక్కుల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమిస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. 100ఏండ్ల సుధిర్ఘ ప్రస్తానంలో సిపిఐ నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలతో ప్రజలకు, కార్మికవర్గానికి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టిట్టామని, ఎందరో అమరవీరులు నేలకొరిగారని, మరెందరో ప్రజలకోసం తమ జీవితాలను త్యాగం చేశారని వారి ఆశయాలను సాధించేందుకు పార్టీ శ్రేణులు అనునిత్యం శ్రమించాలని కోరారు. ఉద్యమాలు నిర్వహించి నిర్మాణపరంగా గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే విషయంలో ప్రతి కార్యకర్త కృషిమరువలేనిదన్నారు. తనను నమ్మి అత్యధిక ఓటు వేసి గెలిపించి ప్రజలు ఆశించిన అభివృద్ధి సహకారం చేయటమే తన లక్ష్యమని తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేందుకు ప్రతి చిన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాట్లు, మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి పార్టీ మరింత విస్తరణకు తోడ్పడాలి అని పిలుపునిచ్చారు. ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, వాడే లక్ష్మి అధ్యక్షతన జరిగిన మహాసభలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరటి ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మికుమారి, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు గుండాల నాగరాజు, వి పద్మజ, డీ సుధాకర్, ప్రజాసంఘాల నాయకులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వర్క అజిత్, చెన్నయ్య, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి సునీల్, నిమ్మల రాంబాబు, కోరే కృష్ణ, %బాూ% రెహమాన్, కాసర్ల రామారావు, ఎస్.కె గౌస్ పాషా, మడుపు ఉపేంద్ర చారి, కుర్రు రమేష్, సత్యనారాయణ, బిక్కులాల్, పద్మ, లక్ష్మీ, రాకేష్, రవి, వెంకట్రామయ్య, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో గర్ల్స్ హాస్టల్ లో కిచెన్, ఫుడ్, స్టోర్ రూమ్ తనిఖీ



చొప్పదండి /కరీంనగర్,జులై 12 (అక్షరం న్యూస్)

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జేసీ గర్ల్స్ హాస్టల్ లో చొప్పదండి పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ తో మాట్లాడి ఫుడ్, కాస్మొటిక్ చార్జెస్,డ్రింకింగ్ వాటర్,బుక్స్ నూతనంగా వచ్చిన 6 వ తరగతి క్లాస్ విద్యార్థులకు ట్రంకు పెట్టెలు,నోట్ బుక్స్ త్వరగా అంది ఇవ్వాలని ప్రిన్సిపాల్ ను అడిగారు,అడిగి, తనిఖీ చేశారు. పిల్లలు ఎలా ఉన్నారని వారిని అడిగి తెలుసుకుంటూ వారికి కావాల్సిన లోటు బాట్లను పరిష్కారానికి సహకరిస్తామని వారికి ప్రతిరోజు ఫుడ్ మెనూ ఎలా ఉంది మార్నింగ్ టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం పెడుతున్నారు పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కమిటీ మెంబెర్స్ కూడా కిచెన్, రైస్ బ్యాగ్ లను, కిచెన్ స్టోర్ రూమ్,డ్రింకింగ్ వాటర్, పిల్లలకు గీజర్ ఎలా ఉన్నాయా అని పరిశీలించారు తదనంతరం. ఇలా రెండవ శనివారం రోజున పిల్లల తో పాటు పేరెంట్స్ కమిటీ బాడ్ మెంబర్స్ కూడా భోజనం చేస్తూ పిల్లలతో భోజనం చేస్తూ ఉంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది అని వ్యక్తం చేస్తూ. అలాగే ఇంకా ఫుడ్ మెనూ ప్రకారం వంట రుచిగా చేయాలని ప్రిన్సిపాల్ ని కోరారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ సంబోజి సునీల్,పాముల రమణ,బి రాజేష్,జనరల్ సెక్రెటరీ జావాజీ దేవేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిర్ర తిరుపతి, అనిల్, రాజు,మ్యాదరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బిడ్డలకే రాజ్యాధికారం

- 42 శాతం రిజర్వేషన్ సాహసోపేతమైన నిర్ణయం
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి రమేష్ గౌడ్



కరీంనగర్, తిమ్మాపూర్ జూలై 12 (అక్షరం న్యూస్)

తిమ్మాపూర్ మండలకేంద్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మండల కాంగ్రెస్ శ్రేణులు శనివారం టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేశ్ గౌడ్ మాట్లాడుతూ...గత ప్రభుత్వాలు బీసీలను అణగదొక్కాయని,కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి అగ్రవర్ణ కులాలతో సమానంగా బిసిలకు హక్కలు కల్పిస్తూ రాష్ట్ర మంత్రి వర్గం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను తీర్మానించడం సంతోషకరమంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్ళ పాలనలో బిసిలను అనగదొక్కుతూ 33శాతం ఉన్న బిసి రిజర్వేషన్ ను కేసిఆర్ 27శాతానికి తెస్తే, బిసి నినాదంతో గెలిచిన బండి సంజయ్ పార్లమెంటులో బిసి రిజర్వేషన్ ప్రస్థావనే తీయలేదని కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ మూడు పార్టీల్లో ఏ పార్టీకి చిత్తశుద్ధి ఉందో బిసిలంతా గ్రహించాలని సూచిస్తూ 42శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీకి, సిఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు, ఎమ్మెల్యే కవ్వంపల్లికి బిసిల తరపున,మండల కాంగ్రెస్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సరిత, నాయకులు కుంట రాజేందర్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, కొత్త రాజిరెడ్డి,రెడ్డిగాని రాజు, చెన్నబోయిన రవి, పొలు రాము, రమేష్, బుదారపు శ్రీనివాస్, బండారిపెల్లి లక్ష్మణ్,మార్క రాములు, తమ్మనవేణి రమేష్, గుంటి మల్లేశం, గోదారి చిట్టిబాబు, గోదారి తిరుపతి, నగునూరి శ్రీనివాస్, పెంట వినోద్ కుమార్ బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నదాతలకు బాసటగా మంత్రి తుమ్మల

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల పరవళ్ళు
- సాగునీరు లేక ఎండుతున్న పంటలు
- సాగర్ నీటి విడుదలకు కొంతమేర ఆలస్యం
- సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు విడుదలకు మంత్రి ఆదేశం
- మంత్రి ఉత్తమ్ తో మాట్లాడిన మంత్రి తుమ్మల
- రెండు జిల్లాల కలెక్టర్లకు నీటి విడుదలకు కీలక ఆదేశాలు
- మంత్రి తుమ్మలకు జేజేలు పలుకుతున్న రైతులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 12 జూలై /అక్షరం న్యూస్ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నదాతలకు బాసటగా నిలుస్తున్నారు. శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సీతారామ ప్రాజెక్ట్ ద్వారా బిజీ కొత్తూరు వద్ద మొదటి పంపు నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు అందక నారుమల్లు, పొలాలకు ఎండిపోతున్న తరుణంలో పంటలకు గోదావరి నీరు విడుదల చేయించి రైతన్నలకు కొండంత భరోసాగా నిలిచారు.

రైతుల మరియు ప్రజాప్రతినిధుల విజ్ఞప్తితో. వర్షాలు సకాలం లో పడక సాగు నీరు లేక పంటలు ఎండి పోతున్నాయని రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విజ్ఞప్తితో రంగంలోకి దిగిన మంత్రి తుమ్మల రైతాంగాన్ని ఆదుకునేందుకు గోదావరి జలాలు విడుదల చేయాలని నిర్ణయించారు. నిర్ణయమే తరువాయిగా సీతారామ ప్రాజెక్టు నుంచి నీటినీ ఉమ్మడి ఖమ్మంలోని జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టుకు విడుదలపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తముమార్ రెడ్డి, కలెక్టర్లతో తుమ్మల మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు లేక, సాగర్ నీరు రాక వరి నారుమళ్ళు, పొలాలు ఎండిపోతున్నాయని నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల ఆలస్యమవుతోందని, సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదలకు నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ కు మంత్రి తుమ్మల సూచించారు. వెనువెంటనే విద్యుత్ శాఖ అధికారులు, ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్లతోనూ మంత్రి తుమ్మల మాట్లాడారు. రైతంగ అవసరాలు దృష్ట్యా రైతులను ఆదుకునేందుకు తక్షణమే నీటి విడుదలకు కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

### పంటలకు ఊపిరి పోసిన మంత్రి తుమ్మల...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వైరా, సత్తుపల్లి,వర్షదారం మీద ఆధారపడిన అశ్వరావుపేట, కొత్తగూడెం ,పినపాక నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు గోదావరి జలాలు అందించి రైతులకు మంత్రి తుమ్మల ఊపిరి పోశారు. లక్షలాది ఎకరాలలో పంటలు సాగు చేసి, నారుమల్లు పోసి వర్షాలు, సాగర జలాల కోసం చూస్తున్న రైతులకు సాగర్ నీరు కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందారు. మంత్రి తుమ్మలకు సమస్యను వివరించారు. నీరు లేకుంటే పంటలు నిలువునా ఎండిపోతాయని తమ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించిన మంత్రి తుమ్మల ఆయకట్టు పరిధిలో రైతులకు నీరు అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. చెప్పిన వెంటనే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నీరు విడుదల చేయించి... రైతన్నల ఆప్తమిత్రుడిగా చెరగని ముద్ర వేశారు. మంత్రి తుమ్మల అనూహ్య నిర్ణయంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. మంత్రి చేసిన కృషికి మంత్రి తుమ్మలకు రైతన్నలు జేజేలు పలుకుతున్నారు.

### జిల్లా సస్యశ్యామలమే తుమ్మల లక్ష్యం...

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల కీలక అడుగులు వేస్తున్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ , సీతమ్మ సాగర్ లతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు విశేష కృషి చేశారు. సీతారామ ప్రాజెక్టు ఆది నుంచి పూర్తి చేసేలా అహర్నిశలు శ్రమించారు. అన్నదాతలు ఇబ్బందుల్లో ఉన్నారనే మాట వినగానే ప్రభుత్వం యంత్రాంగాన్ని మొత్తం కదిలించి రైతులకు నిరంధించేలా చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీతారామ ప్రాజెక్టు ఎస్ ఈ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ పి డీసీఎల్ ఎస్సీ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జయలక్ష్మి, సిపిఓ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు పెనాల్టీ విధించవద్దు

- సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్యా రమేష్
- న్యాయబద్ధంగా దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుల ను ఇబ్బందులకు గురి చేసే కాంట్రాక్టర్స్ పై చర్యలు తీసుకోవాలి.
- సింగరేణి సివిల్ జిఎం కి వినతి పత్రం అందజేసిన సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు నాయకులు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /12 జిల్లా/ అక్షరం న్యూస్: సింగరేణి సివిల్ జిఎం కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన అనంతరం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్య రమేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అఖిల భారత కార్మిక సంఘాలు నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్ తో సమ్మెలోకి దిగిన దేశవ్యాప్త కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కూడా ఈ సమ్మెలో పాల్గొని తమ నిరసనను స్వచ్ఛందంగా తెలియజేశారనీ, చట్టబద్ధంగా సింగరేణి యాజమాన్యానికి సంబంధిత అధికారులకు 14 రోజుల ముందు సమ్మె నోటీసులు అందజేయడం జరిగిందని వారన్నారు. అయినప్పటికీ ఉద్దేశపూర్వకంగా జులై 9న జరిగిన సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల కు జీతం చెల్లించకుండా ఒక్కరోజు జీతాన్ని కట్ చేసి కాంట్రాక్టర్లు ఇబ్బందుల పాలు చేసే అవకాశం ఉందని వారన్నారు. సింగరేణి యాజమాన్యం రూల్స్ ప్రకారం లేబర్ చట్టం ప్రకారం నో వర్క్ నో పే పద్ధతిని పాటించి చట్టబద్ధమైన సమ్మెలో పాల్గొన్న కార్మికులకు ఆరోజు కూడా జీతం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు . ఈ సందర్భంగా కొత్తగూడెం సివిల్ జిఎం గారి కార్యాలయంలో సిఐటియు నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు గూగులోత్ సక్రాం,రాజేష్ పాల్గొన్నారు

# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చల్లా వంశీ చందర్ రెడ్డి కలిసిన ఆర్యవైశ్య నాయకులు





- 1వైరా పట్టణ పార్టీ అధ్యక్ష పదవి ఆర్యవైశ్యుల కు కేటాయించాలి..
- వినతి పత్రం అందజేత.

ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ జూలై 12/ వైరా (అక్షరంన్యూస్)

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఏ సి సి కార్యదర్శి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చల్లా వంశీ చందర్ రెడ్డిని ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ సమక్షంలో శనివారం ఆర్యవైశ్య సంఘ ప్రముఖ నాయకులు కలిసి ఇన్చార్జి బాధ్యతలు తీసుకున్న చందా వంశీ చందర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు ఆర్యవైశ్య సంఘం నాయకులు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అండదండగా ఉంటూ స్థానిక సంస్థల్లోనూ చురుగ్గా పాల్గొంటు పార్టీకి అండదండగా ఉన్నారని గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపులో మా కమ్యూనిటీ పాత్ర కూడా ఎంతో ప్రాముఖ్యత చెందిందని మెజార్టీ వర్గంగా ఉన్న మాకు వైరా పట్టణ పార్టీ అధ్యక్షులుగా ఆర్యవైశ్యులకు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు గతంలో కూడా పట్టణ పార్టీ అధ్యక్ష పదవిని ఆర్యవైశ్యులకు కేటాయించారని వైరా మండల పరిధిలోమెజార్టీకమ్యూనిటీపర మైన మాకు పట్టణ పార్టీ అధ్యక్ష పదవికేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు వైరాలో ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన అనేక మంది కార్యకర్తలు నిజాయితీ గా పార్టీలో ఉంటూ ఇప్పటికీ పార్టీ నియమ నిబంధనలు కనుగుణంగా నడుచుకుంటున్నారని మా కమ్యూనిటీ పరంగా మెజారిటీ కుటుంబాలు కూడా కాంగ్రెస్ పార్టీ బాటలో నడుస్తున్నాయని ఈ సందర్భంగా వారికి విన్నవించారు కావున జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అయిన తమరు కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్ష పదవిని మా కమ్యూనిటీకి కేటాయించేలా చూడాలని విన్నవించారు అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బాధ్యతలు తీసుకున్న వంశి చందర్ రెడ్డిని ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా దుశ్యాలవతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిట్టపల్లి నాగేశ్వరరావు (నాగి) కోదండ రామాలయం మాజీ చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాసరావు అను మో లు భాస్కర్ రావు రాష్ట్ర కల్వ సుజాత అభిమాన సంఘం నాయకులు గ్రంధి ప్రవీణ్ కుమార్ వైరా మండల కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు జీవివి రవికుమార్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తాటికొండ రాము బండారు కృష్ణారావు మైలవరపు శ్రీనివాసరావు కొణతం రాజా చిన్ని నరేష్ వంశీ చందర్ రెడ్డి కలిసి వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.

## గోదావరి వరదలపై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 12 జూలై /అక్షరం న్యూస్ : గోదావరి నదిలో వరద ప్రవాహం పెరిగే అవకాశం నేపథ్యంలో ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో శని వారం జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. వరద ముప్పు ఉన్న లోతట్టు గ్రామాల జనాభాను ముందుగానే గుర్తించి, తాత్కాలిక నివాస శిబిరాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, వైద్య సేవలు, శుభ్రత, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రజల ప్రాణాలకు ఏమాత్రం హానీ కలగకుండా ఉండేందుకు అన్నివిధాలుగా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాల సహాయాన్ని కోరాలని అధికారులను ఆదేశించారు. పశువుల రక్షణ, పశువులకు అవసరమైన మేత, మందుల లభ్యతను సైతం ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వర్తిస్తుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగానే ముంపు గ్రామాలను పరిశీలన చేయాలన్నారు. ముంపుకు గురయ్యే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. అత్యవసర సేవలకు హెలికాప్టర్ సేవలను వినియోగించుకోవడానికి అనుగుణంగా హెలిపాడ్లు ఏర్పాటు చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో గర్భిణీ మహిళలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాబితాను సిద్ధం చేసి సమీప ఆసుపత్రిలో చేర్పించు విధంగా చర్యలు తీసుకోవాలని, 108 అంబులెన్సు అందుబాటులో ఉంచాలని, ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, ప్రాథమిక వైద్యంపై సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతుంటాయని ప్రజలు దాటే ప్రయత్నం చేయకుండా భారీ గేడింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రణాళికలు చేపట్టాలని అన్ని శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు.ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, లోకల్ బాడీస్ అదన కలెక్టర్ విద్యా చందన, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ఎస్ ఇ శ్రీనివాస్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ మహేందర్, ఆర్ అండ్ బి ఈ ఈ రమణారావు, డిఎంహెచ్వో జయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సంజీవరావు, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, కలెక్టరేట్ ఓ ఎస్ డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ను పరిశీలించిన..జిల్లా వ్యాధి నిరోధక టీకాల, లాజిస్టిక్ మేనేజర్ వెంకటరమణ



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ జూలై 12 /తల్లాడ (అక్షరంన్యూస్) తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని వ్యాధి నిరోధక టీకాల నిల్వ కేంద్రమును మన్సూర్ తండా తండా గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమమును జిల్లా వ్యాధి నిరోధక టీకాల మరియు లాజిస్టిక్ మేనేజర్ వెంకటరమణ పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో గర్భిణీ స్త్రీలకు మరియు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వేయించినట్లయితే వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చునని తెలియజేశారు.ప్రస్తుతం పిల్లలకు 12 రకాల వ్యాధులు రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని తల్లిదండ్రులందరూ సకాలంలో పిల్లలకు ఇప్పించినట్లయితే పిల్లలలో క్షయ, పోలియో, డిఫ్తీరియా ,కంఠ సర్పి ,నీళ్ల విరోచనాలు ,హెపటైటిస్ , తట్టు వ్యాధి మొదలగు వ్యాధులు రాకుండా అరికట్టవచ్చునని తెలియజేశారు.అదేవిధంగా ప్రస్తుతం స్టాప్ డయేరియాకార్యక్రమం నడుస్తుందని ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాలలోపు పిల్లలలో వచ్చే డయేరియా వ్యాధిని మన ఇంటి వద్ద లభించే నిమ్మరసం , మజ్జిగ, గంజి మొదలైన ద్రావణాలు తో అరికట్టవచ్చునని ఒకవేళ తగ్గకపోతే ఓ ఆర్ ఎస్ మరియు జింకు మాత్రలను వేసుకొన్నట్లయితే పిల్లలలో డయేరియా వ్యాధి తగ్గుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ పెద్ద పుల్లయ్య , ఫార్మసిస్ట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు శిరీష శ్రావణ సంధ్య ఆశా కార్యకర్త సరోజినీ పాల్గొన్నారు.

## హుస్నాబాద్ లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు. మంత్రులకు పాలాభిషేకం

42 శాతం బీసీ రిజర్వేషన్ కు కేబినెట్ ఆమోదం చారిత్రాత్మకం.



**హుస్నాబాద్/సిద్దిపేట జులై 12(అక్షరం న్యూస్)**
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ కులగణన పై శనివారం రోజున క్యాబినెట్లో బీసీలకు 42శాతం క్యాబినెట్ ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతగా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలోక్యాబినెట్లో ఉన్న మంత్రులకు మరియు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ కి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలువ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**జనగామ జిల్లా/రఘునాదపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 12:**
స్టేషన్ ఘనాపూర్ రిజర్వాయర్ నుండి నవాబుపేట రిజర్వాయర్ కు వెళ్లే మండలంలోని కంచనపల్లి వద్ద జరుగుతున్న ప్రధాన కాలువకు సంబంధించిన నిర్మాణ పనులతో పాటు కెనాల్ కట్ట, స్మశాన వాటికకు వెళ్లే బ్రిడ్జి నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి గబ్బెట, కోడూరు వెళ్లే కాలువలలో ఏపుగా పెరిగిన తుంగను రెండు, మూడు రోజుల్లో తొలగించేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లోనే శ్రావణ్ కుమార్. కోళ్ల రవిగౌడ్ రవిందర్, పర్మ సిద్దేశ్, వంగరవి. కిషన్, జార్జి, యాట కొమురయ్య, సందీప్, ప్రకాష్, జానీ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్రికూటాలయాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 12:**
మండలంలోని నిడిగొండలో శిథిలమైన చారిత్రాత్మకంగా పేరున్న త్రికూటాలయాన్ని బీజేపీ జిల్లా అధ్యకుడు సౌడ రమేష్ తో పాటు పలువురు బిజేపీ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సౌడ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే కొన్ని వందల ఏళ్ల చరిత్ర కలిగిన త్రికూటాలయం పూర్తిగా శిథిలమైం దని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ పునర్నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరయిన్నటికి నామ మాత్రంగా పనులు చేసి కంట్రాక్టర్ చేతులు దులుపుకోవడం విడూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఆలయ పునర్నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుక మార్. కావటి ముత్యాలు,వ్యావర రాజు, తుమ్మలపల్లి సోమేశ్వర్, రంజిత్, చెవ్వ రాజు, యామంకి కొంరెల్లి, మల్కపురం శ్రీకాం త్. మహేందర్, రవి, కమలాకర్, పేరోజ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజల కోసం మరవలేని త్యాగాలు చేసింది కమ్యూనిస్టులే...



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), జూలై 12:**
సమాజంలో సామాన్య ప్రజలకు సమన్యాయం జరగాలనే లక్ష్యంతో మరువలేని త్యాగాలు చేసింది కమ్యూనిస్టులేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. కుర్చపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించిన సిపిఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాపర్తి రాజు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం సత్తా చాటాడానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని. మండలంలో అధిక సంఖ్యలో ఎంపిటీసీలు, సర్పంచ్లు, వార్డు మెంబర్లు గెలవాలని అన్నారు. అంతకు ముందు కమ్యూ నిస్టు ఉద్యమ చరిత్ర అనే అంశంపై పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య చందు నాయక్ వివరించారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఇర్రి అహేల్య, రాపర్తి సోమన్న, పొదల నాగరాజు,కాసాని పుల్లయ్య, మంచాల మల్లేష్, మైలారం వెంకటేశ్వర్లు, పొదల లవకుమార్. నామాల యాదగిరి, నరేష్, రాజు, అయోధ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పాలి

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు



**జనగామ జిల్లా/రఘునాదపల్లి,/( అక్షరం న్యూస్ ) జూలై 12:**
స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ కు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని, స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుంటే మాజీ ఎమ్మెల్యే రాజయ్య కళ్లు న్న చూసి ఓర్వలేక కళ్లులేనట్లు మాట్లాడుతున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు ఎద్దేవ చేశారు. మండలంలోని కంచనపల్లిలో కాంగ్రెస్ జిల్లా ఉపాద్యకుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన్నర బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూంల పదకం జాడ లేకుండ పోయిందని. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బీమా, రైతు భరోసా ఇస్తుంటే చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే రాజయ్య కళ్లల్లో నిప్పులు పోసుకుంటూ అక్కను వెల్లబోసుకుంటున్నాడని ఆగ్రహంవ్యక్తం చేశారు. స్టేషన్ ఘనాపూర్ రిజర్వాయర్ నుండి ప్రధాన కాలువ ద్వారా రూ.148 కోట్ల వ్యయంతో లింగాలఘణపురం మ%శీ%డలం నవాబుపేట రిజర్వాయర్ తో పాటు రఘునాధపల్లి మండలం కంచనపల్లి, గబ్బెట, కోడూరు, రామన్నగూడెం, కన్నారు. పల్లి రైతులకు సాగు నీరు అందించడానికి కృషి చేస్తుంటే, రాజయ్య కడియం శ్రీహరిని విమర్శించడం ఆయన దివాళకోరు తనానికి నిదర్శనంగా నిలుస్తుందని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు నియోజకవర్గం అభివృద్ధిని పట్టించుకోకుండ పనులు, పథకాలు, పదవులను అమ్ముకున్న రాజయ్య ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడడం అంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందనిఅన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యకుడు కోళ్ల రవిగౌడ్, లోనే రవిందర్, పర్మ సిద్దేశ్, వల్లాల పురుషోత్తం, లోనే శ్రావణ్ కుమార్, కొలిపాక మల్లేష్, రంగోజు ఈశ్వరయ్య, వడ్లకొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణకై ఉద్యమిద్దాం..

**8 కోట్ల కూలీలను ఉపాధికి దూరం చేసిన బిజేపీ..**

**వ్యకాస మండల, డివిజన్ మహాసభలను సన్నద్ధం కావాలి.**

**ప్రజా ఉద్యమాల్లో కూలీలు భాగస్వామం కావాలి..**

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు**



**ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ జూలై 12 /వైరా (అక్షరంన్యూస్)**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో ప్రధాని నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన నాటి నుండి ఉపాధి హామీ పథకాన్ని తూట్లు పొడుస్తూ సంవత్సరం, సంవత్సరం నిధులు తగ్గించుకుంటూ రైతు కూలీలకు ఆర్థికంగా అన్యాయం చేస్తున్నారని, ఉపాధి చట్టాల పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మికులు రైతు కూలీలందరూ ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం వైరా నియోజకవర్గం వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం వైరా పట్టణంలోని బోడెపూడి భవనంలో వ్యవసాయ కార్మిక జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005ను వామపక్ష ఎంపీల మద్దతుతో, వ్యవసాయ కూలీల పోరాటాలతో చట్టం సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో పార్లమెంటులో ఉపాధి హామీ చట్టం ఆమోదించబడిందని, ఆనాడు ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల ఐదు వేల కోట్ల రూపాయలు కేటాయించి సంవత్సరానికి 100 రోజులు పని కల్పించే విధంగా అమలు చేశారని తెలిపారు. కానీ నేడు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరం, సంవత్సరం క్రమంగా బడ్జెట్ తగ్గిస్తూ 2025 సంవత్సరానికి గాను కేవలం 69 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి క్రమంగా నిధులు తగ్గించడం ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో జాబు కార్డు ఉన్న రైతు కూలీలు ఉపాధికి దూరం అవుతున్నారని, పని దినాలు తగ్గిపోతున్నాయని, 8 కోట్ల మంది కూలీలు ఉపాధికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా జాతీయ ఆదాయానికి కూడా జిడిపి తగ్గుతున్నదని, కీలకంగా గ్రామీణ ప్రాంతంలో వస్తువు వినియోగం జరగాలంటే దేశంలో 40 కోట్ల మంది ఉన్న వ్యవసాయ కూలీలకు పని కల్పించాలని అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పనకు బడ్జెట్ కేటాయించని బిజెపి ప్రభుత్వం మరోవైపు కార్పొరేట్ శక్తులకు, సంపన్న వర్గాలకు రాయితీలు ఇస్తూ దేశ సంపదను కట్టబెడుతున్నారని, సంపన్నులు కట్టవలసిన పనులను రద్దు చేయడం, ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పరిశ్రమలను ప్రైవేటీకరించడం, కార్పొరేట్ సంస్థలకు మద్దతు ఇస్తూ నేడు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గ్రామ గ్రామాన నిర్వహించే చైతన్యవంతమైన పోరాటంలో ప్రజలు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీలు వేయాలని, మండలం, డివిజన్ మహాసభలను సన్నద్ధం కావాలని, గ్రామ స్థాయిలో కార్యకర్తలను తయారు చేయాలని, రాబోయే కాలంలో విస్తృతంగా నిర్వహించే ప్రజా ఉద్యమాలలో వ్యవసాయ కూలీలను కీలకంగా భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ, తూము సుధాకర్, గుమ్మా నరసింహారావు, బదావత్ శ్రీనివాసరావు, రామచంద్రయ్య, ప్రసాద్, జాన్ పాపయ్య, పోడు గిరిజన నాయకురాలు అరుణ, సిఐటియూ జిల్లా నాయకులు సుంకర సుధాకర్, చెరుకుమల్లి కుటుంబరావు, బాజోజు రమణ, యనమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కల్లు డిపోలపై అధికారులు పర్యవేక్షణ చేయాలి.. వై విక్రమ్

- సరితా క్లీనిక్ సెంటర్ కల్లు దుకాణాన్ని పరిశీలన...



**ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ జూలై 12( అక్షరంన్యూస్)**
హైదరాబాద్ శివార్లలో కల్తీ కల్లు తాగి ఐదుగురు మరణం నేపథ్యంలో ఖమ్మం నగరంలో వున్న రెండు కల్లు డిపోలపై అధికారులు పర్యవేక్షణ చేసి ముందుస్తు గా జాగ్రత్తలు తీసుకోవాలి అని సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. శనివారం సరితా క్లీనిక్ సెంటర్ వున్న కల్లు దుకాణాన్ని పార్టీ టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ హైదరాబాద్ కల్తీ కల్లు సంఘటనలో రోజు రోజుకు మృతుల సంఖ్య పెరుగుతోంది అని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో అధికారులు మొక్కుబడి పరిశీలనలు చేయడం, అప్పుడు అప్పుడు మాత్రమే తనిఖీలు చేయడం చేస్తున్నారు అని ఆరోపించారు. ప్రతిరోజూ నమూనాలను ల్యాబ్ కు పంపడం ద్వారా కల్తీ కల్లు ను కొంతమేరకు అయినా నివారణ చర్యలు తీసుకోవచ్చు అని తెలిపారు. ఖమ్మం నగరంలో ఏమైనా సంఘటనలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు సిహెచ్ భద్రం, నాగేశ్వరరావు,ఎస్ కె హుస్సేన్, పి వాసు, మల్లికార్జున్ రెడ్డి, గుమ్మడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం..

**ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి. కిరణ్ కుమార్..**



**ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ జూలై 12 /తల్లాడ (అక్షరంన్యూస్)**
బీసీలకు న్యాయం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలోనా, ఇప్పుడు, ఎప్పుడు కూడా బీసీలకు న్యాయం చేసే దమ్మున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా, పదవులను ఇవ్వడంలోనైనా, సంక్షేమం విషయంలోనైనా బీసీలకు న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశానికే ఆదర్శం అని కొనియాడారు. బీసీ కులాలు రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. సీఎం గౌరవ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, మరియు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గానికి శాసనసభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అనుచిత వ్యాఖ్యలు మాట్లాడితే సహించేది లేదు

## -పుట్ట మధుకర్ ప్రజల కోసం కాదు, తన రాజకీయ ఉనికికోసమే వ్యవహరిస్తున్నాడు.

## - మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల.తిరుపతి యాదవ్




**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూలై 12 అక్షరం న్యూస్:** మంత్రి శ్రీధర్ బాబు పై బీఆర్ఎస్ నాయకుడు పుట్ట మధుకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. శనివారం రామగిరి మండలంలోని శ్రీపాద ఐఎన్టీయూసి భవన్‌లో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల అధ్యక్షులు రోడ్డ బాపన్న ఆధ్వర్యంలో పత్రికల సమావేశం నిర్వహించారు. సందర్భంగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ పుట్ట మధుకర్ ప్రజల కోసం కాదు, తన రాజకీయ ఉనికికోసమే వ్యవహరిస్తున్నాడు.మంత్రి శ్రీధర్ బాబు చేసిన అభివృద్ధిని ప్రశంసించడమే కాకుండా, ప్రజలకు ఉపయోగపడే మార్గంలో వ్యవహరించాల్సిన బాధ్యత అతనిపై ఉంది. కానీ ఆయనకు అభివృద్ధిపై లేశమాత్రమైన ఆసక్తి లేదు" అని మండిపడ్డారు. ఇటీవల రామగిరి మండలంలోని నాగపెల్లి గ్రామంలో చోటు చేసుకున్న ప్రేమవివాహ జంట ఘటనలో బీఆర్ఎస్ నాయకుడు పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన విషయాన్ని రాజకీయంగా వాడుకుంటూ మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబులపై నిందలు వేయడాన్ని ఆయన ఖండించారు. నీవు ఒకప్పుడు ఎంఎల్ఏ , జెడ్పీ చైర్మన్‌గా ఉన్నావు కాబట్టి రాజ్యాంగ విలువల పట్ల నీకు బాధ్యత ఉండాలి. పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం ఏ విధంగానూ సమర్థించదగినది కాదు. ప్రజల శాంతిని భద్రపరచాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది" అని ఆయన తెలిపారు. గత పాలనలో బీఆర్ఎస్ నాయకుల తీరుతో గ్రామాల్లో అలజడి వాతావరణం నెలకొన్నదని, ఇప్పుడైతే కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ప్రజలు శాంతియుతంగా జీవిస్తున్నారని గుర్తుచేశారు.ఇప్పుడు ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారు. శ్రీధర్ బాబు నాయకత్వం లేకుండా మీ రాజకీయ జీవితం నిలదొక్కుకో లేకపోతుంది. ఆయన పేరును జపించకపోతే మీ పబ్బం గడవదన్న విషయం మీకే తెలుసు" అంటూ తిరుపతి యాదవ్ ఎద్దేవా చేశారు. మరోసారి మంత్రి శ్రీధర్ బాబు పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు లపై అసత్యపు ఆరోపణలు చేస్తే దానికి సమాధానం రెట్టింపులో ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెంటినారి కాలనీ టౌన్ ప్రెసిడెంట్ కాటన్ సత్యం, జిల్లా ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య, మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపిటీసీ గణపతి, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, బీసీ సెల్ అధ్యక్షులు బండారు సదానందం, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఖండే పోశం, సీనియర్ నాయకులు ఎల్లా రామ్మూర్తి, ఆరెల్లి కొమురయ్య గౌడ్, దేవనూరి శ్రీనివాస్, సందెల కుమారస్వామి, కల్వల శంకర్, మోత్కూరి అవినాష్ గౌడ్, లక్కఆర్తి మల్లయ్య, జెమినీ గౌడ్, తీగల సది, ఓడేటి చంద్రశేఖర్, తులసిరామ్ గౌడ్, ఉడుత శంకర్, రాములు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి సంబురాలు

### తల్లి బిడ్డల ఆరోగ్యం మన అందరి బాధ్యత: డిఆర్డిఓ కాళిందిని



**పెద్దపల్లి ప్రతినిధి జులై 12 అక్షరం న్యూస్**

ఇందిరా మహిళా శక్తి సంబురాలల్లో భాగంగా ఈరోజు - మేడం పెద్దపల్లి మండలం లోని పెద్దకల్వల గ్రామంలోనీ అంగన్వాడీ సెంటర్ ను విజిట్ చేసి అంగన్వాడీ సెంటర్ ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి సభ్యులందరు హెల్త్ ఇన్సూరెన్స్ చేపించుకోవాలి అని ఎవరికైనా ఏదైనా ఆరోగ్య సమస్య లు వస్తే హెల్త్ ఇన్సూరెన్స్ వాళ్ళ అందే ప్రయోజనాల వివరించారు, మరియు ప్రభుత్వం ద్వారా అంగన్వాడీ సెంటర్లు అందించే పౌష్టికహార మరియు ఆరోగ్య సేవలను సభ్యులకు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఏపీయం అంగన్వాడీ టీచర్స్ మరియు సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు హర్షణీయం



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జులై -12(అక్షరం న్యూస్ )** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీసీ టీచర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడం వలన బీసీ లు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు ఈ సందర్భంగా సీ ఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలోబిసిటిఏ రాష్ట్ర కార్యదర్శి బండారు మల్లేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటకాల సుధాకర్ మండల అధ్యక్షులు కాలేరు రాజన్న డి రాజు పి అంజయ్య శ్రీనివాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

# అర్జీ 1 ఏరియా జిఎం కార్యాలయంలో త్వరలో క్రెచ్ సెంటర్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం)



**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 12 పెద్దపల్లి జిల్లా అక్షరం**

అర్జీ 1 ఏరియా జిఎం కార్యాలయం నందు అర్జీ 1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్ గారి ఆదేశాల మేరకు మహిళా ఉద్యోగుల పిల్లల కోసం క్రెచ్ సెంటర్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేస్తున్న సందర్భంగా శనివారం ఇందుకు సంబందించిన ఏర్పాట్లను, ఇతర పనులను అధికారులు పరిశీలించారు.జిఎం కార్యాలయం నందు పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల యొక్క చిన్నారుల గురించి బెంగ అక్కర్లేకుండా ఉద్యోగం చేసే మహిళలు పిల్లల ఆలనాపాలనా చూసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని యాజమాన్యం గుర్తించి, పని ప్రదేశాల్లో క్రెచ్ సెంటర్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉద్యోగ బాధ్యతలు నిర్వహణ విషయంలో పురుషులతో పోలిస్తే మహిళకు కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. ఇంటి బాధ్యతలు చూసుకోవాలి. పిల్లల ఆలనాపాలనా వారి మీదనే ఉంటుంది. వీటన్నింటిని చూసుకుంటూనే ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. పిల్లలు కాస్త పెద్దవాళ్లు అయితే పర్లేదు కానీ. నెలల పిల్లలు ఉన్న తల్లులకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం కత్తి మీద సాము లాంటిదే. ఇంట్లో పిల్లలను చూసుకునే వారు ఉంటే పర్లేదు. లేదంటే ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి తలెత్తుంది. ఈ సమస్యను పరిష్కరించడం కోసం సింగరేణి సంస్థ అర్జీ 1 ఏరియా యాజమాన్యం ఇట్టి క్రెచ్ సెంటర్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేయటం మహిళా ఉద్యోగులకు ఒక గొప్ప వరం లాంటిది. త్వరలో ఇట్టి సంరక్షణ కేంద్రం పనులు పూర్తి చేసుకొని జిఎం గారి చేతుల మీదుగా ప్రారంభించుకోవటం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబదించిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అర్జీ 1 యస్.ఓ.టు జియం ఆంజనేయ ప్రసాద్, డిజీ.ఎం ఫారెస్ట్ బానోతు కర్ణ, డిజీ.ఎం సివిల్ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వేల్పుల నారాయణ కథా సంపుటి "వెలుగుల వెనుక" పుస్తక పరిచయం...

### - సిపిఐ, ఏఐటియుసి నాయకులు



**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన వేల్పుల నారాయణ రాసిన కథా సంపుటి "వెలుగుల వెనుక" పుస్తక ఆవిష్కరణ,పరిచయ కార్యక్రమం శనివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సిపిఐ, ఏఐటియుసి ఆద్వర్యంలో జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు,రచయిత వేల్పుల నారాయణ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇట్టి పుస్తకం లో రచయిత వేల్పుల నారాయణ సింగరేణి లో కార్మికుల కష్టాలను, వారి హక్కుల సాధన కోసం నిర్వహించిన పోరాటాలను వివరించారని, ఇట్టి పుస్తకం కార్మికులు, కవులు , కళాకారులు ఆదరించి చదవాలని వారు పేర్కొన్నారు.ఇంకా ఈ పుస్తక పరిచయ కార్యక్రమం లో సిపిఐ, ఏఐటియుసి నాయకులు తాళ్ళపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తొడుపునూరి రమేశ్ కుమార్, టి.ఆర్.సుందర్ రాజ్, ఎజ్జ రాజయ్య, ఎన్.రామక్రిష రావు, పడాల కనకరాజు, బూడిద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# లక్ష్మీ గణపతి మిత్ర మండలి ఆద్వర్యంలో ఘనంగా గోరింటాకు వేడుకలు..!!

### సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసిన గోరింటాకు వేడుకలు..!


### బిజేపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి.



**జ్యోతి నగర్ ఎన్టిపిసి జులై 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

స్థానిక మార్కండేయ కాలనీలో లక్ష్మీ గణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బిజెపి రామగుండం ఇంచార్జి లికందుల సంధ్యారాణిలి ముఖ్య అతిథిగా హాజరై మహిళా మణులతో గోరింటాకు వేడుకలో ఆట పాటలతో సందడి చేశారు..వర్షాకాలం ప్రారంభానికి సూచికగా జరిగే ఈ వేడుకలు.. మహిళల అర్ధనారీశ్వర తత్వాన్ని ప్రతిబింబిస్తూ, సంప్రదాయ పద్ధతులను, సామాజిక విలువలను ముందుకు తీసుకెళ్ళడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతమన భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగ ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది అన్నారు.గోరింటాకు పండుగ అనేది తరతరాలుగా వస్తున్న ఒక సాంప్రదాయ ఆచారం అని తెలియజేసారు.ఆషాఢ మాసంలో మహిళలు గోరింటకు పెట్టుకోవడం ఒక ఆనవాయితీ వస్తుందన్నారు..గోరింటాకు స్త్రీలకు సహజమైన అలంకరణలా ఉపయోగపడడంతో పాటుగా ఇది చేతులు, కాళ్ళకు ఎరుపు రంగును ఇస్తుంది అన్నారు.దీనితో మహిళలు మరింత అందంగా కనిపిస్తారని అన్నారు.గోరింటాకు చర్మానికి చల్లదనాన్ని ఇవ్వడమే కాకుండా, కొన్ని ఆరోగ్య సమస్యలను కూడా దూరం చేస్తుందని తెలిపారు..ఇటువంటి కార్యక్రమాలు పాత తరం నుండి కొత్త తరం వరకు మన సంప్రదాయాలను బతికించేందుకు దోహదపడతాయి అన్నారు...ఈ కార్యక్రమంలో వీణా,సత్య,వినోద,స్వాతి,శ్రీదేవి,పద్మ,రాధిక ,ప్రభ,రాజ్యలక్ష్మి,సంధ్య,శ్రీలత,రమ్య,సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూత అందించాలి



**పెద్దపల్లి టౌన్ జూలై 12 అక్షరం న్యూస్**

కార్పొరేట్ జ్యూవెలరీ దుకాణాల వల్ల ఉపాధి కోల్పోయి ఎందరో స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని స్వర్ణకారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఇవ్వాలని జిల్లా స్వర్ణకార సంఘం నాయకులు కోరారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శనివారం స్వర్ణకారుల సంఘం సమావేశం నిర్వహించారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో చేతి వృత్తులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించి తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని స్వర్ణకారుల మనుగడను దెబ్బతీసే విధంగా కార్పొరేట్ తరహాలో నూతనంగా జువెల్లరీ షోరూంలు విరివిగా ఏర్పడుతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు కులవత్తులనే నమ్ముకొని ఆధారపడిన స్వర్ణకార కుటుంబాలు పనులు కరువై రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు బంగారం పనులు తక్కువ అవ్వడం మూలంగా గత ఆరు నెలల కాలంలో అనేక కుటుంబాలు హాత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయని వాపోయారు ప్రభుత్వం వద్ద పెండింగ్ 5 మెన్ కమిటీ రిపోర్టులను యధాతందగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు రాష్ట్రంలో ఉన్న విధంగా మన రాష్ట్రంలో కూడా వెంటనే స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలేని జీఓ 272 ప్రతిష్టంగా అమలు చేసి అందులో గల లోపాలను సవరించి స్వర్ణకారులపై జరుగుచున్న పోలీస్ వేధింపులను అరికట్టాలని కోరారు సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్వర్ణకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు రంగు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు రాజు ముఖ్య సలహాదారు కందుకూరి పెద్దన్న ప్రకాష్ రావు కోశాధికారి కనపర్తి భాస్కర చారి నాయకులు కొండపర్తి నరహరి కట్ట నగేష్ కుమార్ కట్ట శ్రీధరా చారి బొజ్జం పురుషోత్తం పూసాల చంద్రశేఖర్ పూసాల బాలాజీ సిరికొండ నాగన్న దేవరకొండ నాగేష్ మోదపురం విజయ్ ఉప్పల రామ్మూర్తి బొజ్జం రవీందర్ చారి శ్రీరామోజు జగదీశ్వర్ చారి కట్ట శ్రీనివాస్ బెజ్జంకి శ్రీనివాస్ కందుకూరి రామ్మూర్తి కొండపర్తి బ్రహ్మం తదితులు పాల్గొన్నారు అనంతరం విశ్వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక పోస్టర్లు విడుదల చేశారు

# బదిలీ వెళుతున్న అధికారికి ఆత్మీయ సన్మానం



**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూలై 12 అక్షరం న్యూస్:**

రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా సివిల్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తూ, కొత్తగూడెం కార్పోరేట్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న పి.రాజేంద్రప్రసాద్ ను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు శనివారం వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్వోటుజియం బండి సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.హెచ్.వెంకటరమణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్చేజ్ డిజియం పి.డి.సుధాకర్, సీనియర్ ఫైనాన్స్ ఆఫీసర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణయ్య పోరాట ఫలితమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు


### కరీంనగర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు గుంటి సరూప



**పెద్దపల్లి టౌన్ జూలై 12 అక్షరం న్యూస్**

బీసీల హక్కుల సాధనలో పోరాటం చేస్తూ అనేక విజయాలు సాధించి బీసీలకు ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో 42% రిజర్వేషన్లు సాధనలో సఫలీకృతుడైన రాజ్యసభ సభ్యుడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ను కరీంనగర్ జిల్లా బీసీ నాయకులు అభినందించారు శనివారం హైదరాబాదులోని బీసీ భవన్ లో ఆర్ కృష్ణయ్యను కలిసిన కరీంనగర్ జిల్లా జాతీయ బిసి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు గుంటి సరూప ఆర్ కృష్ణయ్య ను శాలువతో సన్మానించారు. బీసీల హక్కుల సాధనలో పార్టీలతో సంబంధం లేకుండా ఆర్ కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లకు అవకాశం కల్పించడంపై ముఖ్యమంత్రి అభినందించిన తీరు హర్షనీయమని అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున ఆర్ కృష్ణయ్య ముఖ్యమంత్రిని కలవడం మిగతా రాజకీయ పార్టీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించడం తప్పలేదని ఆమె అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామం అని ఆమె అన్నారు ఈ ఆర్డినెన్స్ లో కీలక పాత్ర పోషించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మా స్థానిక శాసనసభ్యులు మేడిపల్లి సత్యంలా కృషిని బిసి వర్గాలు మరచిపోరని ఆమె అన్నారు.

# కళాజాత ప్రదర్శనతో పరిసరాల పరిశుభ్రత పై అవగాహన



**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మార్కండేయ కాలనీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కళాజాతాల ప్రదర్శనతో పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. దోమకాటుకు గురికాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై పాటలు పాడి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు ప్రణీత్, అభినవ్ ,సానిటరీ జవాన్ సంపత్, ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , మెప్మా ఆర్ పిలు ,స్వశక్తి మహిళలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 14 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 21 మంది భూ భారతి ఆపరేటర్ల బదిలీ......

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ జూలై 12( అక్షరంన్యూస్)**

జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టి రెవెన్యూ శాఖ ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టారు. రెవెన్యూ శాఖ పరిధిలో ఒకే చోట చాలా కాలం నుండి పనిచేస్తున్న 14 మంది కంప్యూటర్ ఆపరేటర్లను, 21 మంది భూ భారతి ఆపరేటర్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు గాను ఎన్నో ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వారిని బదిలీ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. రెవెన్యూ శాఖలో సిసిఎల్ఏ పరిధిలో టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్లు, భూభారతి ఆపరేటర్లుగా పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేసి రిలీవింగ్, జాయినింగ్ కు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత మండలాల తహసిల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. పాలనలో జవాబుదారీతనం, పూర్తి పారదర్శకత దిశగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది విధుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా, ప్రజలకు న్యాయం చేకూర్చాలనే నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి.....

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

### గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు..

### రఘునాథపాలెం మండలం కె.వి. బంజర లో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పాల్గొన్న జిల్లా కలెక్టర్.

**ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ జూలై 12 (అక్షరంన్యూస్)**

గ్రామంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు, శనివారం రఘునాథపాలెం మండలం కె.వి. బంజరలో కెవి బంజర నుండి క్రొత్త తండా క్రాస్ రోడ్డు వరకు ఎస్.టి.ఎస్.డి.ఎఫ్. నిధులు ఒక కోటి 30 లక్షల అంచనాతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి గ్రామంలో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని, మనం చేసే పని పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు. రోడ్డు నిర్మాణ పనులను గ్రామ ప్రజలు పర్యవేక్షించాలని అన్నారు.నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. గ్రామంలో గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలను ఎంపిక చేసి వారికి 5 లక్షల రూపాయల సహాయం అందించి సొంత ఇళ్ళు నిర్మాణం చేసే విధంగా అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకొని వలస కూలీ ఆత్మహత్య



**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/జులై-12(అక్షరం న్యూస్)**

పొట్ట కూటి కోసం పశ్చిమబెంగాల్ నుంచి వలస వచ్చిన ఓ మేస్త్రి కూలీ చిప్పలపల్లి రోడ్ ప్రక్కన ఉన్న చెట్టు కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిప్పల పల్లి లో చోటుచేసుకుంది.స్థానిక ముస్తాబాద్ ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం పశ్చిమబెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లా మహాదేవ్ పూర్ తాలూకా చోట్ పూర్ వెస్ట్ పార గ్రామానికి చెందిన బచ్చు చౌదరి (33) చెందిన వ్యక్తి గత పది రోజుల క్రితం చీకోడ్ గ్రామానికి తమ గ్రామ వ్యక్తులతోవచ్చి చిప్పల పల్లి గ్రామం లో మేస్త్రి పని చేస్తుండేవాడని తెలిపారు.ఎప్పుడు కుటుంబ సమస్య లు చెప్తూ బాధ పడుతూ ఉండేవాడని. ఆ సమస్య ల కారణంగా శుక్రవారం రాత్రి చెట్టుకు ఉరి పెట్టుకొని చనిపోయాడని తెలిపారు. అతనితో కలసి వచ్చిన స్నేహితుడుబిష్ణు చౌదరి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు మృతునికి ముగ్గురు సంతానమని వారు పశ్చిమబెంగాల్లోనే ఉంటున్నారని తెలిపారు

# రైతులు ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలి....

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

### నాణ్యమైన పామాయిల్ మొక్కలను మాత్రమే రైతులు నాటేలా చర్యలు..

### నవంబర్ నాటికి పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభించాలి..

### పామాయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలి..

### జిల్లాలో వక్క తోట సాగుకు ప్రయోగాత్మకంగా చర్యలు..

### కొణిజెర్ల మండలం అంజనాపురంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల..

**ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ వైరా/ జూలై 12 (అక్షరంన్యూస్)**

రైతులు ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

మంత్రివర్యులు, శనివారం కొణిజెర్ల మండలం, అంజనాపురం గ్రామంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఆయిల్ పామ్ మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతుల సందేహాలను శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వి. ప్రసాద్ నివృత్తి చేశారు.ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు డ్రిప్ సౌకర్యం త్వరితగతిన ఏర్పాటు చేయాలని, ఆయిల్ పామ్ పంట సాగు లాభాలను వివరిస్తూ పంట విస్తీర్ణం పెరిగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటే సమయంలో తప్పనిసరిగా గుంతలు 2 ఫీట్ల వరకు తవ్వాలని అన్నారు. ఆయిల్ పామ్ మొక్కల నర్సరీ నుంచి నాణ్యమైన మొక్కలను మాత్రమే రైతులకు అందించాలని, నర్సరీలో ఉన్న లోపాలను పూర్తి స్థాయిలో తొలగించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పామాయిల్ మొక్కల నాణ్యతను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.

పామాయిల్ ఫ్యాక్టరీ నవంబర్ నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆ దిశగా పనులు పూర్తి చేయాలని అన్నారు. రిఫైనరీ పనులు కూడా స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. ఫ్యాక్టరీ త్వరగా ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉపాధి లభించడంతో పాటు ప్రభుత్వానికి, రైతులకు ఆదాయం అధికంగా లభిస్తుందని అన్నారు. సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కూడా ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలు అందిస్తామని అన్నారు. దేశంలో ఎక్కడా సీడ్ ఫ్యాక్టరీ లేదని, మన దగ్గర ఏర్పాటు చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి దావోస్ లో ఒప్పందం చేసుకున్నారని, అవసరమైన భూమి రైతులకు ఎటువంటి నష్టం లేకుండా సేకరించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మన దగ్గర రెండు, మూడు ఎకరాలలో పామాయిల్ పంట సాగు చేస్తే మల్టీ నేషనల్ కంపెనీలో పని చేస్తే లభించే ఆదాయం కంటే ఎక్కువ సంపాదించే ఆస్కారం ఉంటుందని అన్నారు. ఆధునిక సాంకేతిక వినియోగిస్తూ పామాయిల్ దిగుబడి పెరిగేలా చూడాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వక్క మొక్కలు నాటామని అన్నారు. మన దగ్గర పొలాలలో వక్క తోటలు పండించడానికి ప్రయోగాత్మకంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18 నెలల కాలంలో లక్షా ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేశామని అన్నారు.








మే నెలలో కురిసిన వర్షాలతో కొంత మంది రైతులు పంట సాగు ప్రారంభించారని, ప్రస్తుతం వారికి ఇబ్బంది కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టుకు సరఫరా చేసేందుకు నిర్ణయించి నేడు విడుదల చేశామని అన్నారు.రైతులు వరి కు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని అన్నారు. ప్రస్తుతం తాను వక్క తోట సాగు చేస్తున్నానని, ఈ పంట 60 సంవత్సరాల పాటు దిగుబడి ఇస్తుందని, తన సాగు బాగా జరిగితే మిగిలిన రైతులకు కూడా ఈ పంట విస్తరించేలా ప్రభుత్వం నుంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా లిలిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి నేడు జరిగిన పామాయిల్ ప్లాంటేషన్ కార్యక్రమం విజ్ఞాన వేదికగా ఉపయోగపడిందని అన్నారు. పామాయిల్ పంట సాగు సంబంధించి చేసే పొరపాట్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి క్లుప్తంగా వీడియోలు తయారు చేసి వాట్సప్, యూట్యూబ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. పామాయిల్ పంటకు ఖమ్మం జిల్లా పెట్టింది పేరని, ప్రస్తుత వానాకాలం సీజన్ లో 7500 ఎకరాలలో పామాయిల్ పంట విస్తరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 4 వేల ఎకరాల్లో పామాయిల్ పంట విస్తీర్ణం చేశామని, మరో 3 వేల ఎకరాల్లో పంట విస్తీర్ణకు హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న వారి ఇబ్బందులను మంత్రి ఆదేశాలు మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆదాయం పెంచే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, మన దగ్గర ఆదర్శవంతమైన రైతులు ఉన్నారని, మంచి పంటల సాగుకు మనం ముందుంటూ ఇతర ప్రాంతాలకు ఆదర్శవంతంగా ఉండాలని, పామాయిల్ సాగులో రైతులకు జిల్లా యంత్రాంగం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో లిలివైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూలి రైతులు నమ్మకంతో పామాయిల్ పంట సాగు చేస్తున్నారని, చిన్నకారు రైతులకు నాణ్యమైన మొక్కలను అందించాలని, రైతులు నష్టపోకుండా చూసుకోవాలని, క్షేత్ర స్థాయిలో రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు. ౖతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన సహాయ, సహకారాలు పూర్తి స్థాయిలో అందిస్తామని, ఇప్పటికే 18 సంవత్సరాలు గడిచిందని, ఫ్యాక్టరీ ప్రారంభం ఇంకా ఆలస్యం చేయవద్దని ఎమ్మెల్యే అన్నారు. లిరాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూలి మంత్రి ప్రోత్సాహంతో తాను కూడా 25 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేయడం జరిగిందని అన్నారు. ఆయిల్ పామ్ పంట పై అవగాహన కార్యక్రమాలు రెగ్యులర్ గా పెట్టాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో రైతులు పామాయిల్ వైపు ఆసక్తి చూపుతున్నారని, ఆ ప్రాంతానికి నాగార్జున సాగర్, భక్త రాందాసు నుంచి సాగు నీళ్ళు వస్తాయని, సీతారామ ప్రాజెక్టు కూడా లింక్ అవుతుందని పుష్కలంగా నీరు అందుబాటులో ఉంటుందని, ఇక్కడ పెద్ద ఎత్తున పామ్ ఆయిల్ పంటలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. పామాయిల్ పంట సాగు సబ్సిడీ విడుదల, డ్రిప్ ఏర్పాటుకు ఎటువంటి లిమిట్ పెట్టకుండా ఉండాలని అన్నారు. 5 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో కూడా ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, కొణిజర్ల మండల తహసీల్దార్ అరుణ, విద్యుత శాఖ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వి. ప్రసాద్, గోద్రెజ్ అగ్రోవెట్ ప్రతినిధులు, అగ్రి హార్టికల్చర్ సొసైటీ సలహాదారు నల్లమల వెంకటేశ్వర రావు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





# ఆరోగ్యకరమైన మొక్కలు పెంచడం లక్ష్యంగా చర్యలు...

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

### ఖమ్మం వై.ఎస్సార్ నగర్ లో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ జూలై 12 (అక్షరంన్యూస్)**



వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకరమైన, ప్రజలకు ఉపయోగపడే మొక్కలు పెంచడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి శనివారం, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధి 8వ డివిజన్ వై.ఎస్సార్ నగర్ లో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని 2 ఎకరాల స్థలంలో ఆర్యానట్ (వక్క) మొక్కలు నాటారు.ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి వన మహోత్సవం కార్యక్రమం క్రింద నాటిన మొక్కలకు రెగ్యులర్ గా వాటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో రోడ్డు కిరువైపులా, డివైడర్ల వద్ద మొక్కలు నాటేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.రోడ్డు విస్తరణ పనులు చేసే సమయంలో చెట్లను తరలించే టెక్నాలజీ వినియోగించాలని అన్నారు. ప్రజలకు, వాతావరణానికి ఉపయోగపడని మొక్కలు గతంలో నాటే వారని, నేడు ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా మోడల్ ప్లాంటేషన్ లో పంటనిచ్చే ఆర్యానట్ (వక్క) మొక్కలు నాటుతున్నామని అన్నారు. రోడ్డు మీడియన్ లలో వేసిన కోనోకార్పస్ మొక్కల వల్ల ఆరోగ్యానికి ఇబ్బందని వస్తున్న వార్తల దృష్ట్యా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో పూర్తి స్థాయిలో తొలగించామని, వీటి స్థానంలో మహాగని, ఆర్యానట్ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ సైదులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అటవీ, సంబంధిత శాఖల అధికారులు, లక్కీ కిడ్స్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# ట్రేడింగ్ సమయం పొడిగింపు ఇప్పట్లో లేనట్లే..!



ముంబయి: డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ సమయం పొడిగించేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ చేసిన ప్రతిపాదనను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ పక్కనపెట్టింది. స్టాక్ బ్రోకర్ కమ్యూనిటీలో ఈ అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఎన్ఎస్ఈ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆశిష్ కుమార్ చౌహాన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ కార్యకలాపాలు మధ్యాహ్నం 3.30 గంటలతో ముగుస్తున్నాయి. క్యాష్, ఎఫ్అండ్ఓ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ కూడా అదే సమయంతో నిలిచిపోతోంది. అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా వ్యవహరించేందుకు వీలుగా తొలి దశలో ఇండెక్స్ ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌ను సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించాలని ఎన్ఎస్ఈ సెబీకి ప్రతిపాదించింది. రెండో దశలో రాత్రి 11.30 గంటల వరకు, మూడో దశలో క్యాష్ మార్కెట్ ట్రేడింగ్ గంటలను సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలని తన ప్రతిపాదనల్లో పేర్కొంది. దేశీయ కాలమానం ప్రకారం.. మన మార్కెట్ల అనంతరం యూరోపియన్ మార్కెట్లు ప్రారంభమవుతాయి. అమెరికా మార్కెట్లు రాత్రి 7 గంటలకు(భారతీయ కాలమానం ప్రకారం) తెరుచుకుంటాయి. దీనివల్ల మార్కెట్ అనంతరం అంతర్జాతీయంగా ఏదైనా పరిణామం జరిగితే.. దానికి అనుగుణంగా ట్రేడర్లు అప్రమత్తం అవ్వడానికి వీలుంటుందని ఎన్ఎస్ఈ పేర్కొంది. ఎన్ఎస్ఈ చేసిన ఈ ప్రతిపాదన పట్ల కొందరు స్టాక్ బ్రోకర్లు అభ్యంతరాలు లేవనెత్తారు. ట్రేడింగ్ సమయం పెంపు వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల అదనపు మ్యాన్ పవర్ కూడా అవసరం పడుతుందని, నిర్వహణ పరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సంప్రదాయ స్టాక్ బ్రోకర్లు సెబీకి తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. డిస్కౌంట్ బ్రోకర్లు మాత్రం గడువు పొడిగింపునకు మొగ్గు చూపారు. ఈ ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రస్తుతానికి ఈ నిర్ణయాన్ని సెబీ పక్కనపెట్టింది. భవిష్యత్‌లో బ్రోకర్ల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే ట్రేడింగ్ సమయం పెంపు పట్టాలెక్కే అవకాశం ఉంది.

# బిజినెస్

## నెల క్రితం ప్రమోషన్.. ఇప్పుడు లేఆఫ్.. టెస్లాలో భారత టెకీ ఆవేదన!



టెక్నాలజీ రంగంలో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్నాయి. చాలా మంది తమ ఉద్వాసన పట్ల షాక్‌కు గురవుతున్నారు. తమ ఆవేదనను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంటున్నారు. ఓ ప్రముఖ నివేదిక ప్రకారం.. ఏప్రిల్‌లో టెక్ కంపెనీలు దాదాపు 21,500 మంది ఉద్యోగులను తీసేశాయి. గత నెల తొలగింపులు టెస్లాతో ప్రారంభమయ్యాయి. అందులో ఓ భారత టెకీ కూడా ఉన్నారు. దాదాపు ఏడేళ్ల పాటు పనిచేసిన ఆమె స్టోరీని సోదరుడు జతిన్ సైనీ లింక్డిన్‌లో పంచుకున్నారు. టెస్లాలో తన సోదరిని తొలగిస్తూ పంపిన మెయిల్ స్క్రీన్‌షాట్లను జతిన్ సైనీ ఓ పోస్ట్‌లో పంచుకున్నారు. ఎలాన్ మస్క్‌కు చెందిన ఆ కంపెనీలో తన సోదరి ఏడేళ్ల పాటు కష్టపడి పనిచేసినట్లు చెప్పారు. గత శుక్రవారం తొలగించేసినట్లు వెల్లడించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా తన రోల్‌ను తీసేస్తున్నట్లు మెయిల్‌లో పేర్కొన్నారు. అయితే, నెల క్రితమే సోదరికి ప్రమోషన్ వచ్చినట్లు సైనీ తెలిపారు. న్యూజెర్సీ నుంచి వాషింగ్టన్‌ను మారేందుకు కూడా సిద్ధమైనట్లు చెప్పారు. ఈ విషయం తెలిసి తమ కుటుంబం చాలా సంతోషించినట్లు చెప్పారు. కానీ, మే 3న ఆఫీసుకు వెళ్తే తన కార్డు పనిచేయకపోవటంతో తన ఆశలన్నీ అడియాసలైనట్లు వాపోయారు. ఆమె టీమ్‌లో దాదాపు 75 శాతం మందిని తొలగించినట్లు వెల్లడించారు. ఏడేళ్లు కష్టపడి పనిచేసిన తర్వాత ఒక్క ఈమెయిల్‌తో బయటకు పంపడం పట్ల తన సోదరి తీవ్ర ఆవేదనకు గురైనట్లు తెలిపారు. టెస్లా కార్ల విక్రయాలు ఈ మధ్య గణనీయంగా పడిపోయిన విషయం తెలిసిందే. మరోవైపు ప్రత్యర్థి సంస్థల నుంచి పోటీ కూడా ఎక్కువవుతోంది. దీంతో కంపెనీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విక్రయాలు పెంచడం కోసం ధరలను తగ్గించింది. త్వరలో అందుబాటు ధరలో కొత్త కార్లను తీసుకురానున్నట్లు ప్రకటించింది. మరోవైపు ఖర్చులను తగ్గించుకోవడం కోసం పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తోంది. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా తమ కంపెనీలో పనిచేస్తున్న దాదాపు 10 శాతం మంది సిబ్బందికి ఉద్వాసన పలికింది.

## కోరమాండల్ ఇంటర్నేషనల్ బోర్డులో ఇద్దరు కొత్త డైరెక్టర్లు

ఎరువులు, సస్య రక్షణ ఉత్పత్తులు అందించే కోరమాండల్ ఇంటర్నేషనల్ బోర్డులో ఇద్దరు కొత్త డైరెక్టర్లు అరుణాచలం వెల్లాయన్, నారాయణన్ వెల్లాయన్ నియమితులయ్యారు. వీరు అయిదేళ్ల పాటు బోర్డులో కొనసాగుతారు. అరుణాచలం వెల్లాయన్ చెన్నై లయోలా కాలేజీలో బీకామ్ చదివారు. తదుపరి యూకేలోని లాంకస్టైర్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ (అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్) పట్టా పుచ్చుకున్నారు. ఈఐడీ ప్యారీ ఇండియా, చోళమండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ తదితర సంస్థల్లో పనిచేశారు. నారాయణన్ వెల్లాయన్ యూకేలో యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ నుంచి ఎల్ఎల్‌బీ (హానర్స్) పూర్తి చేశారు. 2010 నుంచి కోరమాండల్ ఇంటర్నేషనల్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. 'ఎకోజెన్'లో వాటా పెంచుకున్న కోరమాండల్: ఎకోజెన్ అనే క్లైమేట్ స్మార్ట్- డీప్‌టెక్ కంపెనీలో కోరమాండల్ ఇంటర్నేషనల్ తాజాగా రూ.24 కోట్లు పెట్టుబడి పెట్టింది. తన అనుబంధ సంస్థ అయిన దేర్ వెంచర్స్ లిమిటెడ్ ద్వారా ఈ పెట్టుబడి పెట్టడంతో, ఎకోజెన్‌లో కోరమాండల్ వాటా 5.54 శాతానికి పెరిగింది. ఎకోజెన్ 2022-23లో రూ.274 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. సమీప భవిష్యత్తులో ఆఫ్రికా, ఆగ్నేయ ఆసియా దేశాలకు తన సేవలను విస్తరించే సన్నాహాల్లో ఆ సంస్థ ఉన్నందునే, అదనపు పెట్టుబడి సమకూర్చినట్లు కోరమాండల్ సీఎఫ్ఓ జయశ్రీ శఠగోపన్ వివరించారు.

Coromandel
FUTURE POSITIVE

# ఆరోగ్యం- మహాభాగ్యం

## జాగ్రత్తగా లేకపోతే ఈ సమస్యలు తప్పవు!



లైంగిక హింస, సురక్షితమైన గర్భనిరోధక సాధనాలు/పద్ధతులు పాటించకపోవడం.. ఇలా కారణమేదైనా అవాంఛిత గర్భం దాల్చడం, సమాజానికి/ కుటుంబానికి భయపడి గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోనే తమకు తామే అబార్షన్ చేసుకునే మహిళల సంఖ్య నానాటికీ పెరుగుతోందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఇలాంటి అసురక్షితమైన అబార్షన్ల కారణంగా ఏడాదికి సుమారు యాభై వేల మంది మహిళలు మృత్యువాత పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. అంతేకాదు.. ఇలాంటి స్వీయ వైద్యం భవిష్యత్తులో సంతానలేమితో పాటు ఇతర ప్రాణాంతక ఇన్ఫెక్షన్లకూ కారణమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసురక్షితమైన అబార్షన్ల కారణంగా ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో తెలుసుకుందాం రండి..

### ఇన్ఫెక్షన్‌తో సంతానలేమి!

ఇంట్లోనే అబార్షన్ చేసుకునే క్రమంలో మాత్రలు వాడడం, లేదంటే ఇతర పరికరాల్ని ఉపయోగించడం వల్ల గర్భాశయం పూర్తిగా శుభ్రపడకపోవచ్చు. తద్వారా అధిక రక్తస్రావం, జననాంగాల్లో ఇన్ఫెక్షన్.. వంటి తీవ్ర సమస్యలు తలెత్తచ్చు. ఇది క్రమంగా గర్భా శయం వరకు పాకి సంతానలేమికి సైతం దారితీసే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ఇన్ఫెక్షన్ మూలంగా రక్తం కలుషితమవడం, ఇది శరీరమంతా పాకి ప్రాణ సంకటం కావచ్చని హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఇలాంటి అసురక్షిత గర్భ స్రావాలకు పూర్తి దూరంగా ఉండడం మంచిదని చెబుతున్నారు.

### అధిక రక్తస్రావంతో ముప్పు!

స్వీయ అబార్షన్లు అధిక రక్తస్రావానికి దారితీసే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. దీన్నే పేర్కొంటున్నారు. ఇలాంటి అసురక్షిత పద్ధతుల వల్ల ఒక్కోసారి రక్తనాళాలు డ్యామేజ్ అయి అంతర్గత రక్తస్రావం అయ్యే ప్రమాదమూ ఉందంటున్నారు. ప్రాణాల మీదకు వచ్చే దాకా ఈ సమస్యను గుర్తించలేం. అలాగే గర్భస్రావం చేసుకోవడమంటే బలవంతంగా నెలసరిని ప్రారంభి ంచడమే! ఈ క్రమంలో అయ్యే బ్లీడింగ్‌ని అదుపు చేయడం కష్టమే అంటున్నారు నిపుణులు. ఇలా ఈ రెండు పద్ధతుల కారణంగా ఎక్కువ మొత్తంలో రక్తం బయటికి వెళ్లిపోయి రక్తహీనత తలెత్త డంతో పాటు అవయవాలకు రక్తం, ఆక్సిజన్ అందక అవి దెబ్బతి నడం, ఒక్కోసారి ప్రాణాలకూ ముప్పు వాటిల్లచ్చని చెబుతున్నారు.

## చింతచిగురు...నోరూరు!



చింతచెట్టు చిగురు చూడు... చిన్న దాని పొగరు చూడు... చింతచిగురు పుల్లగున్నాదోయి... నా సామిరంగా చిన్నదేమో తియ్యగున్నాదోయ్... అంటూ అందాల చిన్నదాన్ని చింత చిగురుతో పోల్చి వర్ణించాడో సినీ కవి. వర్ణనకే కాదు... వండినా అద్భుతంగా ఉండే చింతచిగురు రుచికి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. పచ్చబంగారంలా చిటారు కొమ్మన మిలమిల మెరిసే ఈ చిగురును తింటే ఆరోగ్యం గురించి చింత కూడా అవసరం లేదట. ఉండీలేనట్టుగా పులుపూ కాస్త వగరూ కలబోసుకుని భలే రుచిగా ఉంటుంది చింతచిగురు. ఎర్రెర్రని లేలేత చిగురు అయితే కాస్త తియ్యగానూ ఉంటుంది. ఈ చింతచిగురును పప్పులో వేసినా... తాలింపు పెట్టి పులిహోర చేసినా...మాంసాహారంతో ముడి పెట్టి మసాలాలు దట్టించి కూర వండినా అదుర్స్ అనాల్సిందే. పాకశాస్త్రంలో దీంతో ఎన్ని ప్రయోగాలు చేసినా ఫస్ట్ క్లాస్‌లో పాసైపోవడం ఖాయం. ధరతోపాటు రుచిలోనూ పోటీపడగల ఈ చిగురును- అలానే తినేసినా కాస్త ఉప్పు అద్దుకుని నోట్లో వేసుకున్నా వహ్వా అనకమానరు ఎవరైనా. అందుకే ఏ దేశంలో ఉన్నా... వేసవిలో మాత్రం చింతచిగురును ఓ పట్టుపట్టాల్సిందేనంటారు చాలామంది. లేలేత ఎరుపూ, ఆకుపచ్చ వర్ణాలూ కలగలిపిన తాజా చిగురుతో కూరలూ, వేపుళ్లూ, రోటిపచ్చడీ, కారంపొడులతోపాటు- చికెన్, మటన్, రొయ్యలూ, ఎండుచేపలతో కలిపి మాంసాహార కూరలూ వండుకుంటారు.

వేసవికి వీడ్కోలు పలికి... వర్షాలకు స్వాగతం పలికే సమయానికి చింత చిగురు సీజన్ అయిపోయి... ఆకు ముదిరిపోతుంది. కాబట్టి ఏడాదంతా చింతచిగురు రుచిని ఆస్వాదించాలనే ఉద్దేశంతో ఉప్పూ, పసుపూ పట్టించి నిల్వ చేసుకుంటారు కొందరు. మరికొందరేమో కూరల్లోకీ, అన్నంలోకీ పొడి కూడా చేసి పెట్టుకుంటారు. చింతచిగురు అంత మొత్తంలో మాకు దొరకదు కదా అనుకునేవారికోసం ఆన్‌లైన్‌లోనే పలు రూపాల్లో అందుబాటులో ఉంది. పచ్చడీ, కూరల్లోకి పొడీ, చిగురు కారంపొడే కాక, డ్రైడ్ చింతచిగురు కూడా దొరికేస్తోంది. ఎప్పుడంటే అప్పుడు తెప్పించుకుని రుచి చూసేయొచ్చు. కుండీల్లోనే చిగురు...పోషకాలభరితమైన చింతచిగురు వందగ్రాముల ధర రూ.100పైనే పలుకుతోంది. అమ్మో అంత ఖరీదుపెట్టి కొనుక్కోవాలా అనుకునేవాళ్లూ, ఏడాదంతా తాజాగా రుచి చూడాలనుకునేవాళ్లూ... మేడ మీదనో, బాల్కనీల్లోనో ఈ చిగుళ్లను పూయిస్తున్నారు. కుండీల్లో చింత గింజల్ని నాటుకోగా వచ్చిన మైక్రోగ్రీన్స్‌తోనూ నచ్చినట్టుగా గరిట తిప్పుతిన్నారు. అందుకోసం కొన్ని చింత గింజలు తెచ్చి పెట్టుకుంటే.... చింత ఇంట్లోనే చిగుళ్లు వేస్తుంది. కృష్ణాజిల్లా ఈడ్పుగల్లుకు చెందిన రైతు శ్రీనివాసరావు ఎకరం జామతోటలో చిగురుకోసమే చింతను అంతర పంటగా సాగు చేసి... వేసవిలో లక్షలు సంపాదిస్తున్నాడు. మరి అంత డిమాండ్ ఉన్న చింతచిగురుఆరోగ్యానికి ఎన్నోరకాలుగానూ మేలు చేస్తుంది. చింతపండులో కంటే చిగురాకులోనే పోషకాలు అధికం. ప్రొటీన్లు ఎక్కువగానూ కొవ్వు పదార్థాలు తక్కువగానూ లభించే చింతచిగురు(వందగ్రాములు)లో దాదాపు 115 క్యాలరీలు, రెండు గ్రాముల కొవ్వు, ఆరు గ్రాముల ప్రొటీన్, పద్దెనిమిది గ్రాముల కార్బొహైడ్రేట్లు, 140 గ్రాముల ఫాస్ఫరస్, గ్రాము మెగ్నీషియం వంటి ఎన్నో పోషకాలుంటాయి. తరచూ తీసుకోవడం వల్ల డైటరీ ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు శరీరానికి పుష్కలంగా అందుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కీళ్ల నొప్పులను తగ్గించడానికి ఈ ఆకులు మంచి ఔషధంలా పని చేస్తాయి. విటమిన్ సి, టార్టారిక్ యాసిడ్‌లు రోగనిరోధకశక్తిని వృద్ధిచేస్తాయి. చింతచిగురును ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎర్రరక్తకణాల సంఖ్య పెరిగి రక్తం శుద్ధి అవుతుంది. పిల్లలకు తినిపిస్తే నులిపురుగులూ, జీర్ణసంబంధ సమస్యలూ దూరమవుతాయి. చింతచిగురు ఉడికించిన నీళ్లను పుక్కిలిస్తే గొంతు నొప్పీ, మంటా, వాపూ తగ్గుతాయి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల శరీరంలో ఇన్ఫెక్షన్లు దూరమవుతాయి. ఇది కాలేయాన్ని రక్షించడంతోపాటు జీర్ణక్రియల్ని మెరుగుపరుస్తుంది. మధుమేహం ఉన్నవారు చింతచిగురును తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఈ చిగురు రసంలో కాస్త పటికబెల్లం కలిపి తీసుకుంటే ఒంట్లో వేడీ, వాతం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా ఎన్నో సుగుణాలున్న చింతచిగురును ఈ ఒక్క సీజన్‌లో తిన్నా చాలు... ఆరోగ్యపరంగా చింతలెన్నో దూరమవుతాయి.





## ఆరోగ్యకరమైన మొక్కలు పెంచడం లక్ష్యంగా చర్యలు...

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- ఖమ్మం వై.ఎస్సార్ నగర్ లో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ జూలై 12 (అక్షరంన్యూస్)

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకరమైన, ప్రజలకు ఉపయోగపడే మొక్కలు పెంచడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి శనివారం, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధి 8వ డివిజన్ వై.ఎస్సార్ నగర్ లో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని 2 ఎకరాల స్థలంలో ఆర్కానట్ (వక్క) మొక్కలు నాటారు.ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి వన మహోత్సవం కార్యక్రమం క్రింద నాటిన మొక్కలకు రెగ్యులర్ గా వాటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో రోడ్డు కిరువైపులా, డివైడర్ల వద్ద మొక్కలు నాటేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.రోడ్డు విస్తరణ పనులు చేసే సమయంలో చెట్లను తరలించే టెక్నాలజీ వినియోగించాలని అన్నారు. ప్రజలకు, వాతావరణానికి ఉపయోగపడని మొక్కలు గతంలో నాటే వారని, నేడు ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా మోడల్ ప్లాంటేషన్ లో పంటనిచ్చే ఆర్కానట్ (వక్క) మొక్కలు నాటుతున్నామని అన్నారు. రోడ్డు మీడియన్ లలో వేసిన కోనోకార్పస్ మొక్కల వల్ల ఆరోగ్యానికి ఇబ్బందని వస్తున్న వార్తల దృష్ట్యా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో పూర్తి స్థాయిలో తొలగించామని, వీటి స్థానంలో మహాగని, ఆర్కానట్ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ సైదులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అటవీ, సంబంధిత శాఖల అధికారులు, లక్కీ కిడ్స్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రౌన్ రైస్ లేదా వైట్ రైస్.. ఆరోగ్యానికి ఏది మంచిదో తెలుసా..

ఆహారంలో బియ్యం ఒక ముఖ్యమైన భాగం. బియ్యంలో పలు రకాలు ఉంటాయి అని అందరికి తెలిసిందే. అందులో వైట్ రైస్, బ్రౌన్ రౌస్ కూడా ఉంటాయి. ఈ రెండూ కూడా ఆరోగ్యానికి మంచివే. కానీ, ఈ రెండింటిలో ఆరోగ్యానికి ఏది ఎక్కువ మేలు చేస్తుంది? బ్రౌన్ రైస్ లేదా వైట్ రైస్ ఏ బియ్యంలో ఎక్కువ పోషకాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**బ్రౌన్ రైస్ - వైట్ రైస్ మధ్య తేడా**

బ్రౌన్ రైస్ ఒక తృణధాన్యం. ఇది మూడు భాగాలుగా ఉంటుంది. బయటి పొర అయిన ఊకలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. మధ్య భాగంలో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు లోపలి భాగంలో కనిపిస్తాయి. అయితే, తెల్ల బియ్యంలో స్టార్చ్ మాత్రమే మిగిలి ఉంటుంది. తెల్ల బియ్యం త్వరగా ఉడుకుతుంది కానీ బ్రౌన్ రైస్ కంటే తక్కువ పోషకాలను కలిగి ఉంటుంది.

**పోషకాలు**

తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్‌లో ఎక్కువ ఫైబర్, విటమిన్లు ఉంటాయి. బ్రౌన్ రైస్‌లో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. బ్రౌన్ రైస్‌లో మెగ్నీషియం లభిస్తుంది, ఇది కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. బ్రౌన్ రైస్ కంటే వైట్ రైస్‌లో తక్కువ పోషకాలు ఉంటాయి.

## చెరకు రసం ఎంతకాలం నిల్వ ఉంటుందో తెలుసా..

వేసవిలో అందరూ అమితంగా ఇష్టపడే ఆరోగ్యకరమైన పానీయాలలో చెరకు రసం ఒకటి. ఇది శరీరాన్నివెంటనే చల్లబరచి ఉత్సాహాన్ని నింపుతుంది. అంతేకాకుండా హైడ్రేటెడ్‌గా ఉంచే, శక్తినిచ్చే అనేక పోషకాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. కానీ, చెరకు రసం వెంటనే తాగమని ఎందుకు చెబుతారో మీకు తెలుసా? దానిని ఎందుకు నిల్వ చేయరు? అది చెడిపోవడానికి ఎంత సమయం పడుతుంది? చెరకు రసం గురించి తక్కువ మందికే తెలిసిన వాస్తవాలేంటి? ఈ ప్రశ్నలకు సమాధానం ఈ కథనంలో..

**చెరకు రసం తాజాగానే తాగాలా?**

చెరకు రసం తీసిన వెంటనే దానిలో ఆక్సిడేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అంటే దాని రుచి, రంగు, పోషకాలు వేగంగా మారడం ప్రారంభిస్తాయి. కాబట్టి, తాజాగా తాగడం మంచిది.

**చెడిపోవడానికి ఎంత సమయం పడుతుంది?**

చెరకు రసం 15 నుంచి 20 నిమిషాల్లోనే రంగు మారడం ప్రారంభమవుతుంది. ముఖ్యంగా వేసవిలో గంటలోనే చెడిపోతుంది. అందుకే దీన్ని తయారు చేసి వెంటనే తాగాలి.

# ఆయిల్ ఫామ్ సాగు మంచి లాభదాయకం..






- డిసిసిబి డైరెక్టర్ మల్లి బాబు యాదవ్, ఉధ్యాన పట్టు పరిశ్రమ డైరెక్టర్ ముత్యాలు

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ జూలై 12 (అక్షరంన్యూస్)

ఆయిల్ ఫామ్ తోటలు సాగు లాభదాయకమని, ఎంతో మేలు చేస్తుందని, పంటలను ప్రోత్సహించే భాగంగా తెలంగాణ ప్రభుత్వం 80% సబ్సిడీతో మొక్కలను సరఫరా చేస్తుందని, సాగుకు సంబంధించి డ్రిప్ పరికరాలను రాయితీపై సరఫరా చేస్తుందని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పట్టు ఉద్యాన పరిశ్రమ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ముత్యాలు, ఉద్యాన శాఖా ధికారి ఆకుల వేణు, జంగారెడ్డిగూడెం గూడెం కు చెందిన పామాయిలు సాగు ప్రముఖ రైతు గొర్రె శేఖర్ బాబుతెలిపారు

కామేపల్లి మండలం, పండితాపురం గ్రామంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ కు సంబందించిన వ్యవసాయ భూమిలో "ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ప్రోగ్రాం " క్రింద ఆయిల్ ఫామ్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూనెల వాడకం విపరీతంగా ఉందని, దానిలో పామాయిలు ఎక్కువగా వాడుతున్నారని, దేశంలో కోటి ఎకరాలలో పంటల సాగు అవసరమని, కానీ కేవలం 7 లక్షల ఎకరాల్లో మాత్రమే ఇప్పటివరకు సాగు అవుతుందని, ఇంకా 93 లక్షల ఎకరాల్లో పంటలు పండించినా సరిపోదని, 70 శాతం నూనెలు ఇతర దేశాల నుండి దిగుబతి చేసుకోవాల్సిన అవసరం వచ్చిందని, మన తెలంగాణలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుందని, సంప్రదాయ పంటలు కాకుండా కూరగాయలు పండ్లు మల్బరీ సాగు లాంటి పంటలను తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుందని, మన రాష్ట్రంలో 30 ఆయిల్ ఫాం ఫ్యాక్టరీలు ఉన్నాయని, ఎకరానికి సంవత్సరానికి రెండు లక్షల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధి చేయడానికి, రైతులకు ఏది లాభం అనుకుంటే, దానిని అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తామని మల్లి బాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారులు ఆకుల వేణు, ఏఈఓ తారా దేవి, ఆయిల్ పెడ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణి, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు తెలిపారు. కామేపల్లి మండలం, పండితాపురం గ్రామంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ కు సంబందించిన వ్యవసాయ భూమిలో "ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ప్రోగ్రాం " క్రింద ఆయిల్ ఫామ్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూనెల వాడకం విపరీతంగా ఉందని, దానిలో పామాయిలు ఎక్కువగా వాడుతున్నారని, దేశంలో కోటి ఎకరాలలో పంటల సాగు అవసరమని, కానీ కేవలం 7 లక్షల ఎకరాల్లో మాత్రమే ఇప్పటివరకు సాగు అవుతుందని, ఇంకా 93 లక్షల ఎకరాల్లో పంటలు పండించినా సరిపోదని, 70 శాతం నూనెలు ఇతర దేశాల నుండి దిగుబతి చేసుకోవాల్సిన అవసరం వచ్చిందని, మన తెలంగాణలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుందని, సంప్రదాయ పంటలు కాకుండా కూరగాయలు పండ్లు మల్బరీ సాగు లాంటి పంటలను తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుందని, మన రాష్ట్రంలో 30 ఆయిల్ ఫాం ఫ్యాక్టరీలు ఉన్నాయని, ఎకరానికి సంవత్సరానికి రెండు లక్షల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధి చేయడానికి, రైతులకు ఏది లాభం అనుకుంటే, దానిని అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తామని మల్లి బాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తారా దేవి, ఆయిల్ పెడ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణి, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు

# ఉరకలేస్తున్న గోదావరి

- గొమ్ముగూడెం చుట్టూ వరద..
- ముంపు మండలాలకు పొంచి ఉన్న ముప్పు
- మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..
- భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం

ఏలూరు/పోలవరం, ధవళేశ్వరం, జూలై 12(( (అక్షరంన్యూస్)

గోదావరి వరద ఉరకలేస్తోంది. శనివారం సాయంత్రం నాటికి భద్రాచలం వద్ద 41.20 అడుగులకు వరదనీటి మట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువవుతోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నిండుకుండను తలపిస్తోంది. ఇప్పటికే రెండు రోజులుగా పోలవరం ప్రాజెక్టు ఎగువన ముంపు మండలాలైన కుక్కునూరు, వే లేరుపాడు మండలాల్లో సుమారు 25 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలం ఎద్దువాగులోకి వరదనీరు చేరడంతో ఎగువన ఉన్న గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం చుట్టూ వరదనీరు చేరడంతో ఆ గ్రామంలోని 250కు పైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. దాచారం పునరావాస కాలనీలో నిరాశ్రయులందరికీ భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. అప్పటికప్పుడు సమీపంలో బోరు తవ్వి తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీహరి ముంపు మండలాల్లోనే మకాం వేసి ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గోదావరి వరద మరింత పెరిగే సూచనలు కనిపిస్తుండడంతో గోదావరి వరద మరింత పెరిగే సూచనలు కనిపిస్తుండడంతో సాధ్యమైనంత మేర పునరావాస కేంద్రాలకు తరలి రావాల్సిందిగా శనివారంనాడంతా ఆయా గ్రామాల్లో అధికారులు ప్రజలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.



### 6,98,782 క్యూసెక్కులు విడుదల

పోలవరం వద్ద గోదావరి వరద జలాలు ఉధృతంగా ప్రవహిసున్నాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 6,98,782 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 31.200 మీటర్లు, దిగువన 22.360 మీటర్ల నీటిమట్టం నమోదయ్యింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి. గోదావరి లంక భూములు నీటమునిగాయి. గండిపోశమ్మ ఆలయం నీటమునగడంతో ఆలయానికి రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

### ధవళేశ్వరం వద్ద.. సముద్రంలోకి 5,29,209 క్యూసెక్కులు

ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద 3.5 లక్షల క్యూసెక్కులు సముద్రంలో కలవగా శనివారం సాయంత్రానికి 5,29,209 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా సముద్రంలోకి వెళుతోంది. ఇక్కడ గోదావరి నీటి మట్టం 10.60 అడుగులకు చేరుకుంది. ఆదివారం నాటికి మరింత పెరిగి సుమారు 7లక్షల క్యూసెక్కులకు పైగా ఎగువ నుంచి రావచ్చని ఫ్లడ్ సెక్షన్ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ఎగువన భద్రాచలం వద్ద 41.40 అడుగులకు పెరిగిన నీటి మట్టం ఆపై నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు ఒక పాయింట్ తగ్గి 41.30 అడుగులకు చేరుకుంది.

నేటి నుంచి వరద తగ్గుముఖం: విపత్తుల సంస్థ

సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా ప్రకారం గోదావరి వరద ఆదివారం నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. అయినా పూర్తి స్థాయిలో వరద తగ్గే వరకు నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సహాయక చర్యల కోసం కోనసీమలో ఒకటి, వేలేరుపాడు, కుక్కునూరులో ఒక్కొక్క ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి గోదావరి వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నదీ పరీవాహక జిల్లాల అధికారులకు సూచనలు జారీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

## రాత్రి పడుకునే ముందు ఈ పనులు చేస్తే హాయిగా నిద్రపోతారు..

ఈ మధ్య కాలంలో చాలా మంది నిద్రలేమి సమస్యతో ఎక్కువగా బాధపడుతున్నారు. దీని వల్ల పలు అనారోగ్య సమస్యలు కూడా వస్తాయి. ఇందుకు కారణం మన జీవనశైలి కూడా కావొచ్చు. కాబట్టి, మనం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రశాంతమైన నిద్ర కూడా చాలా ముఖ్యం. మంచి నిద్ర మీ మానసిక, శారీరక ఆరోగ్యానికి చాలా అవసరం. మీరు రాత్రిపూట సరిగ్గా నిద్రపోకపోతే మీ దినచర్యలో కొన్ని మార్పులు చేసుకోవడం మంచిది. కాబట్టి, అవెంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**నిర్ణీత సమయంలో పడుకోండి**

మీ శరీరానికి ఒక నిర్దిష్ట దినచర్య చాలా అవసరం. క్రమం తప్పకుండా, ప్రతి రోజు ఒకే సమయంలో పడుకోవడం, నిద్రలేవడం అలవాటు చేసుకోండి.

స్క్రీన్ సమయాన్ని పరిమితం చేయండి

పడుకునే ముందు మొబైల్ ఫోన్, టీవీ లేదా ల్యాప్‌టాప్ ఉపయోగించడం వల్ల నిద్ర హార్మోన్ అయిన మెలటోనిన్ ప్రభావితం అవుతుంది. పడుకునే ముందు పుస్తకం చదవడం లేదా డైరీ రాయడం వల్ల మీకు నిద్ర బాగా పడుతుంది.

**విశ్రాంతి వాతావరణాన్ని సృష్టించండి**

మంచి నిద్ర కోసం ప్రతిరోజు లైట్లు ఆఫ్ చేసి పడుకోండి. అలాగే, మృదువైన సంగీతాన్ని కూడా వినవచ్చు. ఇలా చేయడం వల్ల ప్రశాంతంగా నిద్రపోతారు. ఈ రకమైన వాతావరణం మీ మెదడుకు విశ్రాంతి, నిద్ర సమయం అని సంకేతాలు ఇస్తుంది.

**పగటిపూట ఎక్కువగా నిద్రపోకండి**

పగటిపూట కొద్దిసేపు పడుకోవడం ఆరోగ్యానికి మంచిదే. కానీ, ఎక్కువసేపు లేదా తప్పుడు సమయంలో నిద్రపోవడం వల్ల రాత్రిపూట మీ నిద్రపై ప్రభావం పడుతుంది.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

**కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలన**



న్యూఢిల్లీ,జూలై12((అక్షరం న్యూస్)

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే పక్రియను చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు- ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

## ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగే ముద్దు

**ఏటా జూలై12న పేపర్ బ్యాగ్ దినోత్సవం**



న్యూఢిల్లీ,జూలై12((అక్షరం న్యూస్)

భూమిలో త్వరగా కరిగిపోయే పేపర్ బ్యాగ్‌ల పేరు మీద ఓ దినోత్సవాన్ని జరిపే పరిస్థితులు ఈ రోజుల్లో ఉన్నాయి. కారణం కాలుష్యం. ఇందుకు సంబంధించి కొన్ని కఠిన వాస్తవాలు తెలుసుకోవాలి. ప్రతి సంవత్సరం జులై 12న ప్రపంచ దేశాలన్నీ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని జరుపు తున్నాయి. తెల్లారితే చాలు... మనం ఏ షాపుకి వెళ్లినా... కూరగాయల కోసం, టిఫిన్ల కోసం వెళ్లినా ..ప్లాస్టిక్ లేదా పాలిథిన్ కవర్లలోనే ఐటెమ్స్ ఇస్తుంటారు. వాడి పారేశాక... అవి భూమిలో కరగవు. కొన్ని వేలు, లక్షల సంవత్సరాలు కరగకుండా అలాగే ఉంటాయి. ఫలితంగా సముద్రాలు, నదులు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. చివరకు సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ కవర్లే ఎక్కువనే రోజులు వచ్చేలా ఉన్నాయి. ఈ పాలిథిన్ కవర్ల బదులు మనమే పేపర్ బ్యాగులు వాడితే బాగుంటుందనే ప్రచారం మొదలైంది. వీటి వల్ల పర్యావరణానికి కాలుష్యం పెద్దగా ఉండదు. పైగా... ఇవి భూమిలో త్వరగా కరిగిపోతాయి. ప్రతి సంవత్సరం ఈ రోజున స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లో పేపర్ బ్యాగుల వాడకం పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే పాలిథిన్ కవర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తారు. అలాగే కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రజలను పేపర్ బ్యాగులు వాడమని ప్రోత్సహిస్తాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి.అమెరికాకి చెందిన ఫ్రాన్సిస్ వోల్లే మొదటిసారి పేపర్ బ్యాగ్ యంత్రాన్ని తయారుచేశారు. ఓ రకమైన కలపతో ఈ బ్యాగులను తయారుచేస్తారు. 1871లో మార్గరెట్ నైట్... మరో యంత్రం చేశారు. అది ఫ్లాట్ బాటమ్ పేపర్ బ్యాగ్స్ తయారుచేసింది. ఆమెను గ్రాసరీ బ్యాగ్ మాతృమూర్తిగా పిలుస్తారు. ఇలా కాలక్రమంలో రకరకాల యంత్రాలు వచ్చి... మంచి పేపర్ బ్యాగులు తయారవుతున్నాయి.పేపర్ బ్యాగులు పర్యావరణానికి హాని చెయ్యవు. వీటిని వాడటం చాలా ఈజీ. వీటిలో ప్యాకింగ్ తేలిగ్గానే ఉంటుంది. ఇవి చూసేందుకు చాలా అందంగా ఉంటాయి. ఇవి భూమిలో విష వ్యర్థాలను వదలవు. వీటిని వాడేశాక... న్యూస్ పేపర్లు, మేగజైన్లు, పుస్తకాలుగా రీసైక్లింగ్ చెయ్యవచ్చు.గతేడాది 2022 నాటికి యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలంటూ 2017లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఆచరణలో అది అమలు కావడం లేదు. మన దగ్గర మార్కెట్‌లోకి వస్తున్న ప్లాస్టిక్‌లో 80 శాతం తిరిగి సముద్రంలోకి చేరుతుంది. ప్లాస్టిక్ నియంత్రణ, డిస్పోజల్‌కు సరైన పద్ధతులు అమలు చేయకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది.

# ఉచిత పథకాలు ఎవడబ్బ సొమ్ము !

న్యూఢిల్లీ,జూలై12((అక్షరం న్యూస్)




అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్న పాలకుల ధోరణి కారణంగా ..ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. ఉచిత పథకాలే అభివృద్ధి అన్నచందంగా పాలన సాగుతోంది. అభివృద్ధి పక్కకుపోయింది. కేవలం పందేరాలు కొనసాగుతున్నాయి. విద్య,వైద్యరంగాలను విస్మరించారు. మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదు. రోడ్ల విస్తరణ కానరావడం లేదు. దోమల నిర్మూలన అటకెక్కింది. పారిశుద్ధ్యం పడకేసింది.

గ్రామాల్లో ఆర్థిక కార్యకాలాపాలు సాగడం లేదు. ఈ క్రమంలో కొత్తకొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పలు చేసామని తెలుగు వల్లభులు చాటుకుంటున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేస్తున్నారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెడుతున్నారు. ఉచిత విద్యుత్, కిలో రూపాయికే సన్న బియ్యం, ఉచిత బస్సు, ఇంటింటికీ పెన్షన్లు వంటి పథకాల జోరు కొనసాగుతోంది. వీటికి తోడు కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇవన్నీ అమలు చేయడానికి అప్పులు చేయడం, వడ్డీలకు మళ్లీ అప్పులు చేయడం, వివిధ రకాల్లో పన్నులు వడ్డించడం అలవాటయ్యింది. ఆదాయం పెచే శాఖలపై అదేపనిగా సమీక్షలు చేయడం చేస్తున్నారు. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయడం లేదు. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్నప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం ద్వారా తమను తాము గప్ప పాలకులుగా భావిస్తున్నారు. ఇప్పుడు ఖర్చు పెడుతున్న ప్రతిపైసా వీరి జేబులోంచి తీయడం లేదు. కనీసం ఒక్క రూపాయి కూడా ఇందులో కలపడంలేదు. రైతుభరోసా కావచ్చు...రుణమాఫీ కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు..దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రప్రజలే అని గుర్తించాలి. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఇలాంటి పథకాల వల్ల ఆర్థిక దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చే ప్రమాదం రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్ర వల్లభులు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. జీతాలకు ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేస్తున్నామనుకుంటున్న కాంగ్రెస్, కూటమి పాలకులు కళ్లు తెరవాలి. పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరోటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ అధికారాన్ని గుప్పిట్లో ఉంచుకుని చేస్తున్న యత్నాలు విరమించుకోవాలి. ఉచిత పథకాలపై నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఇద్దరు సిఎంలు వాటిని ఆపాలని ప్రయత్నించడం లేదు సరికదా అదేదో మహత్కార్యం చేసినట్లుగా ప్రకటనలు చేస్తున్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత పథకాలపై కత్తెర వేయాలి. డబ్బుల పంపిణీని ఆపాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగిస్తున్న ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతుల రుణ మాఫీలు, ఉచిత్ గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల కారణంగా తెలంగాన అప్పుల్లో కూరుకుపోయింది. వీటిగురించి గొప్పలు చెప్పడం మానుకోవాలి. పథకాలు ఎంతమంచివైనా అర్హులకు సాయం అందించడంలో తప్పు లేదు. కానీ దుబారా పథకాలను కొనసాగిస్తే ప్రజలు ఊరికే వచ్చిన వాటిని తింటారు. తరవాత తిట్టడానికి కూడా వెనకాడరు. విపక్షాలు కూడా ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టాలని కోరాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యతులు కాగలరు. రూపాయికి కిలో సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రైతుభరోసా, ఉచిత బస్సు వంటి పథకాలు ఇలా ఒక్కోటి చెప్పుకుంటూ పోతే..ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్క గట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగుపడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరి పాలన అందించిన వారం అవుతాం. 78 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా ఇంకా పేదలు అంటూ పాలన చేయడం సరికాదు. ప్రజల కష్టాలను కొంతయినా తగ్గించగలిగే నిర్ణయాలు మాత్రమే కావాలి. ప్రజలకు నేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. బంగారు పళ్లెంలో అన్నం పెట్టాలని ఎవరూ కోరుకోవడం లేదు. అన్నం తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసకుంటే అదే మేలు. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించకపోవడం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు.

# సెకన్ పాటు ఆగిపోయిన ఇంధన స్విచ్‌లు

- ప్రమాదం వెనక ఎలాంటి కుట్రకోణం లేదు
- పక్షి ఢకొన్న ఆనవాళ్లు అసలే లేవు
- ఎయిరిండియా ప్రమాదంపై 15పేజీల ప్రామిక నివేదిక



న్యూఢిల్లీ,జూలై12((((అక్షరం న్యూస్)

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు- చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది. జూన్ 12న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 270 మంది మరణించారు. దుర్ఘటన జరిగి శనివారానికి సరిగ్గా నెల రోజులైంది. దీంతో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక

విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు- మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిం దని పేర్కొంది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది.ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు నివేదికలో తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం కేవలం 32 సెకన్ల పాటు గాల్లో ఉన్నట్లు- వెల్లడించింది. రన్‌వేకు కేవలం 0.9 నాటికల్ మైళ్ల దూరంలోని ఓ హాస్టల్ భవంతిపై విమానం కూలిపోయిందని నివేదిక వివరించింది. ఇంజిన్లు శక్తిని కోల్పోయిన తర్వాత ర్యామ్ ఎయిర్ టర్బైన్‌ను యాక్టివేట్ చేసినట్లు గుర్తించారు. ఇది యాక్టివేట్ అయినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కన్పించిందని ఏఏఐబీ తమ నివేదికలో వెల్లడించింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్న ఏఏఐబీ, ఈలోపే విమానం కూలిపోయిందని వివరణ ఇచ్చింది. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోల పరిశీలన పూర్తి చేసినట్లు చెప్పింది. విమానానికి సంబంధించి రెండు ఇంజిన్లను వెలికితీసినట్లు-, తదుపరి పరీక్షలకు కాంపోనెంట్స్‌ను గుర్తించామని పేర్కొంది. ఇంజిన్లను భద్రపరిచినట్లు తెలిపింది. ప్రమాదానికి ముందు ఇంధనం, బరువు సైతం పరిమితుల్లోనే ఉన్నాయని, విమానంలో ప్రమాదకరమైన వస్తువులు ఏమీ లేవని తన నివేదికలో స్పష్టం చేసింది. విమానంలో ఇంధనం కూడా స్వచ్ఛంగానే ఉందని, కలుషితమైన ఆనవాళ్లు లేవని తెలిపింది.



# ఎఐ ఆధారంగా భగవద్గీత




### ఐదునిముషాల నిడివిలో పూర్తి

ప్రస్తుతం భారత సినిమా ఇండస్ట్రీ పురాణాలు, ఇతిహాసాల ఆధారిత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వందల ఏళ్ల నాటి గ్రంథాల కథలు, శ్లోకాల గాథలు నేటి టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 'అదిపురుష్', 'శాకుంతలం', 'హనుమాన్' లాంటి సినిమాలు రాగా.. తాజాగా బాలీవుడ్ నుండి 'రామాయణ' కూడా రెండు బాగాలుగా రాబోతుంది. ఇప్పటికే హోంబలే ఫిల్మ్స్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలు నిర్మించనున్నట్లు- అధికారికంగా ప్రకటించగా, ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ మాధ్వాని తాజాగా మరో సర్ప్రైజ్‌ను పంచుకున్నారు. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు- చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్ కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ, అందులో గీతలోని 18 అధ్యాయాల సారాంశం చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ ప్రివ్యూలలో ఈ చిత్రాన్ని ప్రదర్శించాగా.. 'వర్చువల్ రియాలిటీ ద్వారా మనం కథలోని పవిత్రతను పునరుద్ధరించవచ్చు. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాల కంటే గొప్ప కథలు మరేం ఉండవు' అని రామ్ మాధ్వానీ చెప్పారు. తన లక్ష్యం కేవలం పౌరాణిక కథను చూపడం మాత్రమే కాదని, ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతికి దగ్గర చేయడం అని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు కేవలం కథగా మాత్రమే కాదు, మన సంస్కృతి, తత్వాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.

## యానిమల్ లాంటి హీరోతో డేటింగ్

### నటి రష్మిక మందన్న హాట్కామెంట్స్




వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక కెరీర్‌కు, 'యానిమల్' మూవీ ఎంతో విజయాన్ని అందించింది. అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మికను.. ఓ ఇంటర్వ్యూలో నిజ జీవితంలో యానిమల్ హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకురాగలరా? అని ప్రశ్న ఎదురవ్వగా .. ఆసక్తికర సమాధానమిచ్చింది రష్మిక. అలాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతాను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారని చెప్పారు. తాను అర్థంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు.ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు- 'ది గర్ల్ ఫ్రెండ్‌తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు అలాగే అట్లీ- అల్లు అర్జున్ సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి.


## లెనిన్ మూవీ నుంచి శ్రీలీల ఔట్



అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాను , అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై ఈ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ కూడా జరుగుతోంది. పలు పోస్టర్లను కూడా విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో తొలుత టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీ లీలా ఎంపికైంది. తర్వాత ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. శ్రీలీలను లెనిన్ చిత్రం నుంచి తప్పించిన తర్వాత మేకర్స్ షూటింగ్ పనులను మరింతగా వేగవంతం చేశారు. అయితే శ్రీలీలాతో ఇప్పటికే తీసిన ఓ 2 వారాల సీన్లను ఇప్పుడు భాగ్యశ్రీ తో రీషూట్ చేయబోతున్నారని తెలుస్తోంది. శ్రీ లీలా తో తీసిన సీన్స్ అన్నింటిని మళ్లీ చిత్రీకరించ బోతున్నారు. దీంతో టీమ్‌కు మరింత పని భారం పడనుందని అంటున్నారు. కాగా భాగ్యశ్రీ జూలై 16 నుండి షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అవుతున్నట్టు-.. సమా చారం. ఇక ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా థమన్ పనిచేస్తుండగా. మాస్ అప్పీల్, స్టైలిష్ కథనంతో అఖిల్ ఈసారి కచ్చితంగా హిట్ కొడతాడా? అన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.



## పెద్ది నుంచి గౌర్నాయుడు లుక్ విడుదల




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో, గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని.. వెంకట సతీష్ కిలారు నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజువల్ పరంగా సినిమాకి ప్రత్యేకంగా నిలిచేలా ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సంగీతానికి ఎ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. ఇక రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్స్‌తో సినిమాపై అంచనాలు కూడా భాగా పెరిగిపోయ్యాయి. అయితే తాజాగా చిత్రబృదం నేడు సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా, ఈ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను 'పెద్ది' చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదలైన శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్ సినిమాలోని అతని పాత్ర ఎంత బలమైనదో చూపించింది. మందపాటి హ్యాండిల్ బార్ మీసం, గంభీరమైన చూపుతో.. శివరాజ్ కుమార్ లుక్ అదిరిపోయింది. కాగా ఈ మూవీలో ఆయన 'గౌర్నాయుడు' పాత్రలో కనిపించనున్నారు.

## పుష్పలో రష్మిక లాంటి రోల్స్ చేయాలని ఉంది

### కన్నడ నటి సప్తమీ గౌడ వెల్లడి



కన్నడ నుంచి టాలీవుడ్‌కి అందాల భామలు వరుసగా ఎంట్రీ ఇస్తూనే ఉన్నారు. సౌందర్య తర్వాత ఆ ట్రెండ్ తగ్గలేదు. నటనతో, గ్లామర్‌తో ఆకట్టుకుంటూ ఇక్కడ తమ సత్తా చాటుతున్నారు. అనుష్క,పూజాహెగ్డే రష్మిక మందన్న లాంటివారు ముందంజలో ఉండగా, పలు కొత్త హీరోయిలు కూడా టాలీవుడ్‌కి అడుగుపెడుతున్నారు. ఇటీవలి కాలంలో కన్నడ ఇండస్ట్రీ నుంచి పాన్ ఇండియా సినిమాలు వస్తుండటంతో, ఆ చిత్రాల్లో నటించిన హీరోయిన్లకు మిగతా భాషల నుంచి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా 'కాంతార' ద్వారా సప్తమి గౌడ తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకుంది.

అయితే 'కాంతార' లాంటి హిట్ అందుకున్న తర్వాత ఏ హీరోయిన్ అయినా వరుస సినిమాలతో ధూసుకుపోతారు కానీ.. సప్తమి మాత్రం 'కాంతార' తర్వాత ఎక్కువ సినిమాల్లో కనిపించలేదు. అయితే దీనికి స్పష్టమైన కారణం ఉన్నట్లు చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ' 'కాంతార' తర్వాత అదే తరహా పాత్రలు నా ముందుకు వచ్చాయి. రొటీన్‌గా అవే పాత్రలు చేయడం ఇష్టం లేక మంచి పాత్రల కోసం వెయిట్ చేశాను. ముక్కు పుడకలు పెట్టుకోవడం.. గ్రామీణ యువతిగా కనిపించడం.. డైలాగ్స్ లేకపోవడం, సినిమాలో క్యారెక్టర్ సరిగా లేకపోవడం వల్ల నేను సినిమాలు ఒప్పుకోలేదు. మంచి పాత్రల కోసం వెయిట్ చేయడం వల్ల ఎక్కువ సినిమాల్లో నటించలేకపోయాను. మిగతా హీరోయిన్లతో నాకు స్క్రీన్ స్పేస్ లేదు.. ప్రజంట్ తెలుగులో మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాను. మరిన్ని అవకాశాలు వస్తాయని నమ్ముతున్న. పుష్ప మూవీలో రష్మిక మందన్నకు దక్కిన లాంటి రోల్స్ వస్తే బాగుంటుందని వెయిట్ చేస్తున్నా' అని చెప్పారు.

## కీరన్ పొలార్డ్ సూపర్ ఇన్నింగ్స్



మేజర్ లీగ్ క్రికెట్ 2025 టోర్నమెంట్‌లో ఎంఐ న్యూయార్క్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఛాలెంజర్ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టును 7 వికెట్ల తేడాతో ఓడించి ఎంఐ న్యూయార్క్ రెండో సారి టైటిల్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. ముందుగా టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టు బ్యాటింగ్ చేసింది. టెక్సాస్ సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 166 పరుగులు చేసింది. సూపర్ కింగ్స్ బ్యాటర్లలో కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్(42 బంతుల్లో 59 పరుగులు), అకీల్ హుస్సేన్(32 బంతుల్లో 55 పరుగులు), డొనొవాన్ ఫెరీరా(20 బంతుల్లో 32 పరుగులు) రాణించారు. ఈ ముగ్గురి ఇన్నింగ్స్ కారణంగా టెక్సాస్ సూపర్ కింగ్స్ 5 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేయగలిగింది. ఎంఐ న్యూయార్క్ బౌలర్లలో ట్రిస్టన్ లస్ 3 వికెట్లు పడగొట్టగా.. రిషిల్ ఉగార్కర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 167 పరుగుల లక్ష్యంలో న్యూయార్క్ జట్టు బరిలోకి దిగగా.. ఆరంభంలోనే క్వింటన్ డికాక్(6) రూపంలో కీలక వికెట్‌ను కోల్పోయింది. వన్ డౌన్ బ్యాటర్ మైఖేల్ బ్రేస్ వెల్(8) కూడా పూర్తిగా విఫలమయ్యాడు. ఓపెనర్ మోనాంక్ పటేల్ 39 బంతుల్లో 49 పరుగులు చేశాడు. దీనితో పాటు నికోలస్ పూరన్ 36 బంతుల్లో అజేయంగా 52 పరుగులు చేశాడు. ఎంఐ న్యూయార్క్ స్టార్ బ్యాటర్ కీరన్ పొలార్డ్ దంచి కొట్టడంతో విజయం సొంతమైంది. పొలార్డ్ 22 బంతుల్లోనే 213.64 స్ట్రైక్ రేట్‌తో 47 పరుగులు చేశాడు. ఐపీఎల్ లాగే ఇప్పుడు మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో కూడా కీరన్ పొలార్డ్ సూపర్ కింగ్స్ ను ఓడించి జట్టుకు భారీ విజయాన్ని అందించి ఫైనల్‌కు చేర్చాడు. నికోలస్ పూరన్, కీరన్ పొలార్డ్ రెచ్చిపోవడంతో 19 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి ఎంఐ న్యూయార్క్ లక్ష్యాన్ని ఛేదించింది. టెక్సాస్ సూపర్ కింగ్స్ బౌలర్లలో అకీల్, జియా ఉల్ హక్, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.లీగ్ దశలో ఎంఐ న్యూయార్క్ ప్రదర్శన అంతగా ఆకట్టుకోనప్పటికీ.. వారు ఏదో విధంగా ప్లేఆఫ్స్‌కు చేరుకున్నారు. ఇప్పుడు వారు టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టును ఓడించి ఫైనల్‌కు చేరుకున్నారు. జులై 13న(సోమవారం) వేకువ జామున 5.30 గంటలకు వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుతో ఎంఐ న్యూయార్క్ జట్టు తలపడనుంది. వాషింగ్టన్ ప్రదర్శన మొదటి నుంచి బాగుంది. అందుకే ఫైనల్‌లో వారు గెలుపొందేందుకు ఫేవరేట్‌గా ఉన్నారు.

## తెలుగులో విడుదలవుతున్న మై బేబీ

తమిళ్‌లో ఇటీవల విడుదలై సూపర్ హిట్ అయిన 'డీఎన్ఏ' మూవీ ఎలాంటి హిట్ అందుకుందో తెలిసిందే. నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. హాస్పిటల్స్‌లో పిల్లల్ని మాయం చెయ్యడం, వారిని వేరే చోట అమ్మేయడం వంటి వార్తలు చూస్తుంటాం. ఇలాంటి వార్తలు ఇప్పుడు కాదు కొన్ని సంవత్సరాలుగా వింటూనే ఉన్నాం. ఈ సినిమా మరొక్కసారి గా మనం సొసైటీలో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియచేసింది. అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగ డ్రామాతో కూడిన గ్రిప్పింగ్ కథాంశంతో ఆకట్టు-కుంది. అయితే తమిళంలో విజయం సాధించిన మూవీ ఇప్పుడు తెలుగులో మై బేబీ పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్‌మాల్, పిజ్జా వంటి అనువాద హిట్స్‌ని తెలుగు ప్రేక్షకులకు అందించిన నిర్మాత సురేశ్ కొండేటి, ఇప్పుడు 'మై బేబీ' సినిమాను ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై రిలీజ్ చేస్తున్నారు. రీసెంట్ గా తెలుగు సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 18, థియేటర్లలో విడుదల కానుంది. ఇక భావోద్వేగాలతో పాటు- థ్రిల్ కలగలిపిన స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు.

## అవతార్ లాంటి టెక్నాలజీ ప్రవేశ పెడతా : శంకర్



ప్రస్తుతం తన మార్క్ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు డైరెక్టర్ శంకర్. ఇటీవల ఆయన తెరకెక్కించిన రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయాయి. ఇందులో గేమ్ ఛేంజర్ లాంటి సినిమాలు ఉండడంతో విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పుడాయన తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. దాని వివరాలు పంచుకున్నారు. అది భారతదేశం గర్వించే సినిమా అవుతుందన్నారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. లక్ష కాపీలు అమ్ముడైన 'వేల్పారి' అనే నవల గురించి మాట్లాడారు. దీని ఆధారంగా ఆయన తన కలల ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు- తెలిపారు. ఒకప్పుడు నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రోబో'. ఇప్పుడు 'వేల్పారి'. భారీ బడ్జెట్‌తో ఇది రానుంది. ఇప్పటివరకూ చేసిన అతిపెద్ద చిత్రాల్లో ఇది ఒకటి అవుతుంది. దీనికి భారీ స్థాయిలో కాస్ట్యూమ్స్, ఆర్ట్ డిజైన్స్, టెక్నాలజీ అవసరం ఉంది. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్', 'అవతార్' వంటి చిత్రాలకు ఉపయోగించిన సాంకేతికను పరిచయం చేయనున్నాను. ప్రపంచమంతా దీన్ని గుర్తిస్తుంది. త్వరలోనే నా కల నిజం కావాలని కోరుకుంటున్నాను' అని శంకర్ తెలిపారు. భారీ అంచనాల నడుమ శంకర్- కమల్‌హాసన్ కాంబోలో తెరకెక్కిన 'ఇండియన్ 2' నిరాశను మిగిల్చింది. దాని తర్వాత రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ ఛేంజర్'ను రూపొందించారు. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. దీంతో ఆయన తన తదుపరి ప్రాజెక్ట్ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటు-న్నారు. దీనికోసం కన్నడ హీరో యశ్‌తో కూడా సంప్రదింపులు జరిపినట్లు- వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ నిర్మాతలు కూడా ఇందులో భాగం కానున్నట్లు- టాక్ వినిపిస్తోంది.

## కపిల్ దేవ్‌ను దాటేసిన బుమ్రా

లార్డ్స్ టెస్ట్‌లో జస్ప్రీత్ బుమ్రా భారత ఫాస్ట్ బౌలర్లకు ఇప్పటివరకు కలలో కూడా సాధ్యం కాని దాన్ని నిజం చేశాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా రెండో టెస్ట్‌కు దూరంగా ఉన్న బుమ్రా, మూడో టెస్ట్ రెండో రోజు ఉదయం బంతి పట్టుకోగానే ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లపై సునామీలా విరుచుకుపడ్డాడు. అతను ఈ ఇన్నింగ్స్లో 5 వికెట్లు తీయడమే కాకుండా దిగ్గజ బౌలర్ కపిల్ దేవ్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.లార్డ్స్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి, జస్ప్రీత్ బుమ్రా తన కెరీర్‌లో 15వ ఐదు వికెట్ల ఘనతను పూర్తి చేసుకున్నాడు. దీనిలో స్పెషాలిటీ ఏంటంటే.. ఇది విదేశీ గడ్డపై బుమ్రా 13సార్లు ఐదు వికెట్లు తీసిన ఘనతను సాధించాడు. దీంతో అతను కపిల్ దేవ్‌ను వెనక్కి నెట్టాడు. కపిల్ దేవ్ పేరు మీద 12 సార్లు ఐదు వికెట్లను తీసిన ఘనత సాధించిన రికార్డు ఉంది. ఇప్పుడు బుమ్రా విదేశీ గడ్డపై అత్యధిక సార్లు ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు.విదేశీ గడ్డపై అత్యధిక ఐదు వికెట్ల ఘనతలు సాధించిన వారిలో జస్ప్రీత్ బుమ్రా టాప్ ప్లేసులో ఉన్నాడు. బుమ్రా తర్వాతి స్థానంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ఉన్నాడు. అతను విదేశీ గడ్డపై 12 సార్లు ఐదు వికెట్లు తీశాడు. మూడో స్థానంలో భారత అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరైన అనిల్ కుంబ్లే నిలిచాడు.. తను 10 సార్లు ఈ ఫీట్‌ను నమోదు చేసుకున్నాడు. ఇక నాలుగో స్థానంలో టీమిండియా సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ ఉన్నాడు. అతను 9 సార్లు ఈ ఘనతను సాధించాడు.లార్డ్స్ మైదానంలో ఏదో ఒక రికార్డును తమ పేరు మీద నమోదు చేసుకోవాలని ప్రతి క్రికెటర్ కలలు కంటారు. కానీ బుమ్రా ఈ మైలురాయిని చేరుకున్న తర్వాత కూడా చాలా సైలెంటుగా కనిపించాడు. శుక్రవారం ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ సందర్భంగా తన స్పెల్‌లో జోఫ్రా ఆర్చర్‌ను అవుట్ చేసి అతను ఐదు వికెట్లు పూర్తి చేసుకున్నాడు. అది బుమ్రాకు ఆ ఉదయం లభించిన నాలుగో వికెట్. తన అద్భుతమైన బౌలింగ్ సాయంతో భారత్ ఇంగ్లాండ్‌ను 387 పరుగులకే కట్టడి చేసింది.రెండో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ 4 వికెట్ల నష్టానికి 251 పరుగులతో ముందుకు సాగింది. జామీ స్మిత్, బ్రైడాన్ కార్స్ హాఫ్ సెంచరీలు సాధించారు. అయితే, ఆ తర్వాత ఇంగ్లాండ్ జట్టు భారత బౌలర్ల ముందు తడబడింది.

# మీరు అడిగిన ప్రశ్న నేను మర్చిపోయా

లార్డ్స్ మైదానం వేదికగా భారత్ - ఇంగ్లాండ్ మధ్య టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌటైంది. టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ ఇన్నింగ్స్‌లో రఫ్ఫాడించాడు. ఏకంగా ఐదు వికెట్లు నేలకూల్చి ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. ఇక రెండో రోజు అనంతరం బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్?లో పాల్గొన్నాడు.రెండో రోజు ఆట ముగిసిన తర్వాత టీమ్‌ఇండియా తరపున బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యాడు.అయితే భద్రతా కారణాల దృష్ట్యా జర్నలిస్టుల ఫోన్లు అక్కడే టేబుల్‌పై ఉంచుతారు. ఇక బుమ్రా మీడియాతో క్వాశ్చన్ అండ్ అన్సర్ సెషన్‌లో పాల్గొన్నాడు. అయితే మీడియాకు సమాధానం చెబుతున్న టైమ్‌లో సడెన్‌గా ఓ రిపోర్టర్ ఫోన్ రింగ్ అయ్యింది.వెంటనే బుమ్రా ఓ ఫోన్ వైపునకు చూస్తూ 'ఎవరి భార్యో ఫోన్ చేస్తోంది. కానీ నేను ఈ ఫోన్ ఎత్తను' అని సరదాగా అన్నాడు. దీని తర్వాత బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలనుకున్నాడు. కానీ 'మీరు అడిగి ప్రశ్న నేను



మర్చిపోయా, మీరు ఏమి అడిగారు' అని నవ్వుతూ అన్నాడు. దీంతో సీరియస్ ప్రెస్ కాన్ఫరెన్స్ కాస్త ఒక్కసారిగా ఫన్నీగా మారిపోయింది. అక్కడున్న రిపోర్టర్లు నవ్వుకున్నారు.కాగా, తొలి రోజు ఒకే వికెట్ దక్కించుకున్న బుమ్రా, రెండో రోజు ప్రమాదకరంగా మారాడు. ఇన్నింగ్స్ ప్రారంభంలోనే రెండు కీలక వికెట్లు స్టోక్స్, రూట్?ను పెవిలియన్?కు పంపి టీమ్‌ఇండియాను గేమ్?లోకి తీసుకొచ్చాడు. కాసేపటికే డేంజరస్ హ్యారీ బ్రూక్ (11)ను సూపర్ బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక లంచ్ తర్వాత ఆర్చన్?ను పెవిలియన్ చేర్చి ఐదో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు.భారత్ బ్యాటింగ్ ప్రారంభించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్ 53 పరుగులతో, రిషబ్ పంత్ 19 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్?లో 387 పరుగులకు కుప్పకూలింది. సీనియర్ బ్యాటర్ రూట్ (104 పరుగులు) సెంచరీ సాధించాడు. బ్రెండన్ కార్స్ (56) జెమీ స్మిత్ (51) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టీమ్‌ఇండియాలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. ఐదు వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్ తలో 2, రవీంద్ర జడేజా 1 వికెట్ పడగొట్టారు.

# జో రూట్ ప్రపంచ రికార్డ్

### అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న జో రూట్

టెస్ట్ క్రికెట్ చరిత్రలో కేవలం నలుగురు ఆటగాళ్ళు మాత్రమే 200ం క్యాచ్‌లు తీసుకున్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ ఇప్పుడు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. అది కూడా రాహుల్ ద్రవిడ్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి.. నంబర్ వన్‌గా నిలిచాడు.లార్డ్స్ వేదికగా భారత్ తో జరిగిన 3వ టెస్ట్ మ్యాచ్ లో జో రూట్ టీమిండియా బ్యాట్స్ మన్ కరుణ్ నాయర్ ను క్యాచ్ తో పట్టుకున్నాడు. ఈ క్యాచ్ తో టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్ లు పట్టిన ఫీల్డర్ గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ పేరిట ఉండేది. 301 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేసిన ద్రవిడ్ మొత్తం 210 క్యాచ్‌లు పట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు జో రూట్ ఈ రికార్డును బద్దలు కొట్టడంలో విజయం సాధించాడు. జో రూట్ ఇప్పటివరకు 156 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, 296 ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేశాడు. ఈ సమయంలో, అతను తీసుకున్న క్యాచ్‌ల సంఖ్య సరిగ్గా 211లి. దీనితో, టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న ఫీల్డర్‌గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ప్రపంచ రికార్డు శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే పేరిట ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో 768 ఇన్నింగ్స్‌లలో (టీ20ంటెస్ట్ంవన్డే) ఫీల్డింగ్ చేసిన జయవర్ధనే మొత్తం 440 క్యాచ్‌లు పట్టడం ద్వారా ఈ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు.



# కరుణ్ నాయర్ తన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిందే

ఎనిమిదేళ్ల తర్వాత టీమిండియాలోకి తిరిగి వచ్చిన కరుణ్ నాయర్ ఇప్పటివరకు ఇంగ్లాండ్ పర్యటనలో తన బ్యాటింగ్‌తో ఆకట్టుకోలేకపోయాడు. అతనిపై అభిమానులకు చాలా అంచనాలు పెట్టుకున్నారు. కానీ కరుణ్ నాయర్ వాళ్ల ఆశల మీద నీళ్లు చల్లాడు. కరుణ్ నాయర్ ఐదు ఇన్నింగ్స్‌లలో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో మొత్తం 13 సెంచరీలు నమోదయ్యాయి. అందులో శుభ్‌మన్ గిల్ ఒక డబుల్ సెంచరీ కూడా ఉంది. కానీ కరుణ్ నాయర్ బెస్ట్ స్కోరు కేవలం 40 పరుగులు మాత్రమే. ఈ టెస్ట్ సిరీస్‌లో భారత ఆటగాడు ఐదు ఇన్నింగ్స్‌లలో కేవలం 23.40 సగటుతో 117 పరుగులు మాత్రమే చేశాడు. ఈ రెండు జట్ల మధ్య జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కరుణ్ నాయర్ ఖాతా కూడా ఓపెన్ చేయలేకపోయాడు. రెండో ఇన్నింగ్స్‌లో 20 పరుగులు చేశాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో కూడా కరుణ్ నాయర్ నుంచి పెద్ద ఇన్నింగ్స్ ఆశించారు. కానీ తను టీమిండియా అభిమానులను నిరాశపరిచాడు. టీమిండియా ఈ మ్యాచ్‌ను 336 పరుగుల తేడాతో గెలిచినప్పటికీ, నాయర్ మొదటి ఇన్నింగ్స్‌లో 31 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 26 పరుగులు మాత్రమే చేశాడు.మూడో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో అతను 40 పరుగులు చేశాడు.. ఇది ఈ సిరీస్‌లో అతని బెస్ట్ స్కోరు. కరుణ్ నాయర్‌కు వరుసగా ఛాన్సులు వస్తున్నాయి కానీ అతను వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడు. కరుణ్ నాయర్ టీమిండియాలోకి 8 ఏళ్ల తర్వాత రీఎంట్రీ



ఇచ్చాడు. అతను టెస్ట్ క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ కూడా సాధించాడు. అంతకుముందు ఈ భారత బ్యాట్స్‌మెన్ దేశీయ క్రికెట్‌లో చాలా బాగా రాణించాడు. అతను కర్ణాటక టీం తరపున ఆడి భారీ పరుగులు సాధించాడు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన తర్వాత అతని ఫామ్ పడిపోయింది. కరుణ్ నాయర్ అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ గణాంకాల విషయానికి వస్తే.. అతను 9 మ్యాచ్‌లలో 44.63 సగటుతో 491 పరుగులు చేశాడు. అతని బెస్ట్ స్కోరు 303 నాటౌట్. ఇంగ్లాండ్ మీద అతను 6 మ్యాచ్‌లలో 8 ఇన్నింగ్స్‌లలో 62.42 సగటుతో 437 పరుగులు చేశాడు.టీమిండియా తరపున కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లలో 120.20 స్ట్రైక్ రేట్‌తో 601 పరుగులు సాధించాడు. ఇందులో ఒక డబుల్ సెంచరీ, రెండు సెంచరీలు ఉన్నాయి. అంతేకాకుండా, రిషబ్ పంత్ కూడా అద్భుతంగా రాణించి ఇంగ్లాండ్ బౌలర్లను ఇబ్బంది పెట్టాడు. అతను రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ సిరీస్‌లో భారత ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కూడా సెంచరీలు సాధించారు. ఈ నేపథ్యంలో కరుణ్ నాయర్ టీమిండియాలో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో పెద్ద స్కోరు చేయడం తనకు చాలా ముఖ్యం.

# సెంచరీతో చరిత్ర సృష్టించిన కేఎల్ రాహుల్

ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ దుమ్మురేపుతున్నాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన రాహుల్.. 176 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో కీలక భాగస్వామ్యాలతో రాహుల్ జట్టును ఆదుకున్నాడు. అయితే సెంచరీ పూర్తయిన వెంటనే షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కరుణ్ నాయర్‌తో కలిసి రెండో వికెట్‌కు 61 పరుగులు జోడించిన రాహుల్.. రిషభ్ పంత్‌తో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.క్రికెట్ పుట్టిల్లు లార్డ్స్‌లో రాహుల్‌కు ఇది రెండో సెంచరీ. దాంతో ఓ అరుదైన రికార్డ్‌ను కేఎల్ రాహుల్ తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్‌ల్లో లార్డ్స్ వేదికగా రెండు శతకాలు నమోదు చేసిన తొలి ఆసియా ఓపెనర్‌గా నిలిచాడు. ఈ ఘనతను అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. రాహుల్ కంటే ముందు టీమిండియా దిగ్గజ క్రికెటర్ వెంగ్‌సర్కార్ లార్డ్స్ వేదికగా మూడు సెంచరీలు బాదాడు. లార్డ్స్ వేదికగా కేఎల్ రాహుల్ తన తొలి శతకాన్ని 2021లో నమోదు చేశాడు. ఆ మ్యాచ్‌లో టీమిండియా 151 పరుగుల తేడాతో విజయం సాధించింది. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలు లార్డ్స్ వేదికగా సెంచరీ అందుకోలేకపోయారు. లార్డ్స్ మైదానంలో భారత్ నుంచి 10 మంది బ్యాటర్లు మాత్రమే సెంచరీలు నమోదు చేసి హానర్ బోర్డులో తమ పేరును లిఖించుకున్నారు.ఓవరాల్‌గా కేఎల్ రాహుల్‌కు ఇది 10వ టెస్ట్ సెంచరీ కాగా.. ఇంగ్లండ్ గడ్డపై నాలుగో టెస్ట్ శతకం. దాంతో ఇంగ్లండ్ గడ్డపై మూడు సెంచరీలు సాధించిన తొలి భారత ఓపెనర్‌గా రాహుల్ నిలిచాడు. గ్రేమ్ స్మిత్(5 సెంచరీలు) తర్వాత 2000 నుంచి ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక సెంచరీలు బాదిన విదేశీ ఓపెనర్‌గా రికార్డ్ అందుకున్నాడు. రాహుల్ సాధించిన 10 టెస్ట్ సెంచరీల్లో 9 శతకాలు విదేశీ గడ్డపైనే నమోదు చేయడం గమనార్హం. ఇందులో ఇంగ్లండ్ గడ్డపై నాలుగు, దక్షిణాఫ్రికాలో రెండు, ఆస్ట్రేలియా, శ్రీలంక, వెస్టిండీస్‌లలో ఒక్కో సెంచరీలు ఉన్నాయి.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609